

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు

పెందుర్తి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్..

వైసీపీ నేతలపై తీవ్ర ఆగ్రహం



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్




పెందుర్తి సభకు హాజరైన జనం

వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి వంటి నాయకుల గుప్పిట్లో వేలాది ఎకరాలు

- మూడు కబ్జాలు, ఆరు సెటిల్‌మెంట్లు అన్నట్టుగా ఉంది వైసీపీ పాలన
- చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో కలిపేద్దాం
- పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కరెప్షన్ కింగ్
- జగన్ రాష్ట్ర స్థాయిలో దోచేస్తే... అతను పెందుర్తిలో దోచేస్తున్నాడు

విశాఖపట్నం / పెందుర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో భూములను వైసీపీ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దోచేశారని, వేలాది ఎకరాలు వారి కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురం, రాత్రి విశాఖ జిల్లా పెందుర్తి జంక్షన్‌లో జరిగిన సభలో ప్రసంగించారు.

వైసీపీ ప్రభుత్వ పాలన మూడు కబ్జాలు, ఆరు సెటిల్‌మెంట్లు అన్న చందంగా సాగుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా వైసీపీ నాయకులు తమ భూములు దోచేశారన్న మాటే వినిపిస్తోందన్నారు. వైసీపీ నేతలు ... మిగతా 6వ పేజీలో



పెందుర్తి సభలో పవన్‌కల్యాణ్, సీఎం రమేష్, పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి జనసంద్రం

- జనసేన సభకు వెల్లువలా తరలివచ్చిన ప్రజలు
- పవన్ ప్రసంగానికి కేరింతలు

పెందుర్తి, మే 1: పెందుర్తి జనసంద్రాన్ని తలపించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి యాత్ర ప్రభంజనం సృష్టించింది. బుధవారం సాయంత్రం అచ్యుతాపురంలో సభ ముగించుకుని పవన్ కల్యాణ్ హెలికాప్టర్‌లో సరిపల్లిలోని హెలీ ప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ప్రజలకు అభివాదం చేస్తూ పెందుర్తి జంక్షన్‌లోని సభాస్థలికి చేరకున్నారు. జన సైనికులతో పాటు టీడీపీ, బీజేపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వెల్లువలా తరలిరావడంతో పెందుర్తి కిక్కిరిసిపోయింది. పవన్ ప్రసంగిస్తున్నంత సేపు అభిమానులు కేరింతలు, నృత్యాలతో ... మిగతా 6వ పేజీలో

నగరానికి బాలకృష్ణ



బాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న శ్రీభరత్ తదితరులు

- నేటి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రచారం

గోపాలపట్నం, మే 1: ప్రముఖ నటుడు, హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ బుధవారం నగరానికి విచ్చేశారు. ఆయనకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ చేరుకున్న బాలకృష్ణకు టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి, ఆయన అల్లుడు ఎం.శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరంలోకి వెళ్లారు. బాలకృష్ణ గురువారం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. శుక్ర లేదా శనివారాల్లో నగరంలో రోడ్‌షో నిర్వహించనున్నట్టు సమాచారం.

తాగునీటికి కటకట

- నగరంలో ప్రారంభమైన వేసవి ఇక్కట్లు
- టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ప్రైవేటు ట్యాంకర్ల నిరీక్షణ



టీఎస్‌ఆర్ కాంపెక్స్ రిజర్వాయర్‌లో నీళ్లు నింపుకునేందుకు వచ్చిన ట్యాంకర్లు

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీటి ఎద్దడి ప్రారంభమైంది. ఏలేరు, తాటిపూడి, రైవాడ జలాశయాల నుంచి నగరానికి తరలిస్తున్న నీటిని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ సదుపాయం లేని కొండవాలు ప్రాంతాలు, హోటళ్లు, లాడ్జిలు, కొళాయి కనెక్షన్ పొందని అపార్టుమెంట్లకు జీవీఎంసీ, ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా ద్వారకా నగర్‌లోని టీఎస్‌ఆర్ కాంపెక్స్‌లోని రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తుంటారు. అయితే వేసవి నేపథ్యంలో నీటి లభ్యత తగ్గడంతో ప్రైవేటు ట్యాంకర్లకు నీరు ఇచ్చే విషయంలో జీవీఎంసీ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. నగరంలోని ... మిగతా 6వ పేజీలో

ఐదు చోట్ల ఇండిపెండెంట్లకు గాజు గ్లాసు గుర్తు

విశాఖపట్నం, మే 1 (ఆంధ్రజ్యోతి): గాజు గ్లాసు గుర్తు కేటాయింపుపై స్పష్టత వచ్చింది. విశాఖ పార్ల మెంటు స్థానానికి పోటీ చేస్తున్న స్వతంత్రులకు గాజు గ్లాసు కేటాయించలేదు. అయితే విశాఖ తూర్పు, ఉత్తరం, భీమిలి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వతంత్రులకు గ్లాసు కేటాయించడం వివాదాస్పదమవుతోంది. తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న వడ్డి శ్రావణి అనే స్వతంత్ర అభ్యర్థినికి గాజు గ్లాసు గుర్తు కేటాయించారు.

క్రీడా ప్రాంగణాలన్నీ ప్రైవేటుకు ధారాదత్తం

ఇదే ఐదేళ్లలో వైసీపీ సర్కారు చేసిన ఘనకార్యం

- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణ ప్రైవేటు వ్యక్తులకు అప్పగింత
- బీచ్‌రోడ్డులో ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా అంతే...
- స్వర్ణభారతి స్టేడియాన్ని కూడా అప్పగించేందుకు రంగం సిద్ధం
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్
- వైసీపీ నేతల అనుచరులకే అప్పగిస్తున్నారని ఆరోపణలు
- టీడీపీ హయాంలో రూ.4.5 కోట్లతో ఎంవీపీలో స్పోర్ట్స్ ఎరీనా నిర్మాణం ప్రారంభం
- భారీగా ఫీజులు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- ఆటలకు దూరమైపోతున్న పేద, మధ్య తరగతి క్రీడాకారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జీవీఎంసీ పరిధిలోని క్రీడా ప్రాంగణాలన్నింటినీ (స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు) ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ వస్తోంది. ఆదాయమే పరమావధిగా, అస్మదీయులకు ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకుంది. కాంట్రాక్టు తీసుకున్న సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తుండడంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు స్టేడియంలోకి అడుగుపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ తీరుపై క్రీడాకారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.



ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన బీచ్‌రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్



లీజుకి ఇచ్చేసిన ఎంవీపీ కాలనీలో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనా

గత టీడీపీ ప్రభుత్వం నగరంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియం నిర్మించాలని నిర్ణయించింది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కాలేజీ మైదానంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద రూ.4.5 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించింది. అందులో బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు, స్విమ్మింగ్‌పూల్ వంటివి ఉంటాయి. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చివరి దశలో ఉండగా వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. కొన్నాళ్లకు భవన నిర్మాణాన్ని పూర్తి చేసిన తర్వాత జీవీఎంసీ ఆధ్వర్యంలోనే స్టేడియం ఉంటుందని అందరూ భావించారు. అలాగైతే నామమాత్రపు ఫీజుతో అత్యున్నత ప్రమాణాలు కలిగిన స్టేడియంలో సాధన చేసుకోవచ్చునని క్రీడాకారులు ఆశించారు. కానీ వైసీపీ ముఖ్య నేతలకు సన్నిహితుడైన వ్యక్తి కళ్లు స్పోర్ట్స్ ఎరీనాపై పడ్డాయి. అంతే రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనాను ఆగమేఘాల మీద టెండరు పేరుతో అస్మదీయుడైన ... మిగతా 6వ పేజీలో

భీమిలి అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తాం



భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

- ముఖ్యమంత్రిగా చంద్రబాబు విశాఖకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు
- వైసీపీ బస్టాపులు కూడా సరిగా నిర్మించలేకపోయింది
- విశాఖలో రాజధాని అవాస్తవం
- రుషికొండపై భవనాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం
- 'ఆంధ్రజ్యోతి'తో భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాజకీయాల్లో గంటా శ్రీనివాసరావుకు ఓ ప్రత్యేకత ఉంది. ఒకసారి ఏదైనా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే రెండోసారి మళ్లీ అక్కడి నుంచి పోటీ చేయరు. ఇరవై ఐదేళ్లుగా రాజకీయాల్లో ఉన్న గంటా ఓసారి అనకాపల్లి ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యే (చోడవరం, అనకాపల్లి, భీమిలి, విశాఖ ఉత్తరం)గా ఎన్నికయ్యారు. ఇప్పటివరకూ ఆయనకు ఓటమి లేదు. వచ్చే ... మిగతా 6వ పేజీలో

అర్హులందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

» ఎంపీ అభ్యర్థి శ్రీభరత్
» దక్షిణంలో జనసేన అభ్యర్థి వంశీకృష్ణ విస్తృత ప్రచారం

అక్కయ్యపాలెం, మే 1: అర్హులందరికి ఇళ్లు కేటాయించాలన్నది రానున్న కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తెలిపారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం గ్రేటర్ 27వ వార్డు దొండపర్తి రామాలయం జంక్షన్, దేవాంగులవీధిలో స్థానికులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు నిత్యావసరాల పెరిగిన ధరలతోపాటు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, టిడ్కో ఇళ్ల పరిస్థితులపై అభ్యర్థులకు వివరించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గతంలో 12 లక్షల ఇళ్లు రాష్ట్రానికి మంజూరు చేస్తే టీడీపీ ప్రభుత్వం 5 లక్షలు పూర్తి చేసిందని, మిగిలినవి నిర్మాణదశలో ఉండగా ప్రభుత్వం దిగిపోవాల్సి వచ్చిందన్నారు. వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయక పేదల సొంతింటి కల సాకారం కాలేదన్నారు.కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అల్లిపురం: అల్లిపురం ఈతపేట రోడ్డుకు చెందిన అధిక సంఖ్యలో యువత బుధవారం వంశీకృష్ణ సమక్షంలోజనసేన పార్టీలో చేరారు. 32వార్డులో వంశీకృష్ణ సతీమణి పద్మజ విస్తృత ప్రచారం చేశారు. ఇం టింటికీ వెళ్లి వంశీకృష్ణ, శ్రీభరత్‌లకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అధికార మార్పుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని విన్నవించారు.. కార్పొరేటర్ కం దుల నాగరాజు, వార్డు టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్, మే 1: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏవీఎన్ కాలేజీ వద్ద భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు చిన్న రహమాన్, బొచ్చా రామిరెడ్డి, జనసేన నాయకులు పిల్లిరమణ, పూర్ణామార్కెట్ వర్తక సంఘం కార్యదర్శి, టీడీపీ నాయకుడు గంగాడ గోవింద్, పాల్గొన్నారు. వంశీ కృష్ణను గెలిపించాలంటూ ఆయన తనయుడు సందీప్ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 36 వార్డులో పలుచోట్లపర్యటించారు.


మాట్లాడుతున్న శ్రీభరత్


32వ వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ సతీమణి పద్మజ

పవన్ కల్యాణ్ సభను విజయవంతం చేయాలి

మద్దిలపాలెం: పూర్ణామార్కెట్ జంక్షన్ దుర్గాలమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించనున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు, దక్షిణం కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శివాజీపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 6గంటలకు జరిగే పవన్ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

» జై భారత్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ


మహారాణిపార్లర్ వద్ద ప్రచారంలో లక్ష్మీనారాయణ

అక్కయ్యపాలెం, మే 1: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జై భారత్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ బుధవారం అక్కయ్యపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈప్రచారానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. మహారాణిపార్లర్ ప్రాంతంలో ఆయన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ... స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

'ఎన్నికల భారతం' ఆవిష్కరణ

సీతమ్మధార, మే 1: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల భారతం పేరిట కవితా సంకలనం పుస్తకాన్ని పౌరగ్రంథాలయంలో నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ వి.బాలమోహన్‌దాస్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు.


వృద్ధులకు కరపత్రాలందిస్తున్న విష్ణుకుమార్‌రాజు


రామన్నకాలనీలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు. టీడీపీ నేతలు

కూటమి గెలుపుతోనే ప్రజల జీవితాల్లో వెలుగు

» ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

మాధవధార, మే 1; తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే ప్రజా జీవితాల్లో వెలుగులు నిండుతాయని విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెన్మెత్స విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న గందరగోళ పరిస్థితులకు కారణమైన అధికార వైసీపీకి ప్రజలను ఓట్లు వేయమని అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డులో మాధవధారలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వార్డులోని రామన్నకాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో గడప గడపకి వెళ్లి కూటమి మేనిఫెస్టో ప్రయోజనాల్ని విష్ణుకుమార్ రాజు వివరించారు. ఈసందర్భంగా ఆయన దృష్టికి స్థానికులు పలు సమస్యల్ని తీసుకొచ్చారు. స్లమ్ ఏరియాల్లో మద్యానికి ఇంటి యజమానులు బానిసలవడంతో పాటు యువత వైసీపీ పాలనలో పెడదోవ పట్టారే మహిళలు విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పాలన చేతకాని నేతలనుంచి ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. విశాఖకు ఏవిధంగా అన్యాయం జరిగిందో ఈ సందర్భంగా వివరించారు. ఈ విపత్కర పరిస్థిల నుంచి తిరిగి ఓటరు తన వజ్రాయుధంతోనే రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని పారదోలాలని అన్నారు. వైసీపీ పాలన విముక్తితోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి, నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు మురళీనగర్‌లో 50వవార్డు ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో బుధవారం రాత్రి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యుల నిర్వహణలో జరిగిన సమావేశంలో విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు ఈ సందర్భంగా తమ మద్దతుని కూటమి అభ్యర్థులు తెలిపారు. అన్ని విధాలునష్టం చేకూర్చిన వైసీపీ సర్కారు ఓటమితోనే తిరిగి ప్రశాంత విశాఖను సాధించగలమని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

» ఉత్తర నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు

అక్కయ్యపాలెం, మే 1: చిరు వ్యాపారుల కోసం ఇనార్బిట్ మాల్ సమీపంలో ప్రత్యేక స్థలం కేటాయించి వ్యాపారాల అభివృద్ధికి మరింత తోడ్పడతానని ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డు సమీపాన ఎన్నికల కార్యాలయంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో వెజిటేబుల్ మార్కెట్ సంఘం సభ్యులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేకే రాజు హాజరై మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా పక్షపాతి అని అన్నారు. అనంతరం పలువురు చిరువర్తకులు వైసీపీలో చేరారు. దుర్గా వెజిటేబుల్ మార్కెట్ సంఘం అధ్యక్షుడు వెంకట సత్య నారాయణ, కార్యదర్శి రమణమ్మ, ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బానాల శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్ పార్కులో కేకే రాజు మార్నింగ్ వాక్ నిర్వహించారు. వాకర్స్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జీ వీ ఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, రవీంద్రనాథ్ ఠాగూర్‌పాల్గొన్నారు.

వైసీపీకి గవరల సంపూర్ణ మద్దతు

మురళీనగర్; ఉమ్మడి విశాఖ జిల్లాలో గవరలు వైసీపీ అభ్యర్థుల గెలుపునకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు గవర సామాజిక వర్గ ప్రతినిధి, వైసీపీ నాయకులు బొడ్డేటి.కాశీవిశ్వనాథం పేర్కొన్నారు. బుధవారం రాత్రి మురళీనగర్ బొత్స స్క్వేర్‌లో జరిగిన వైసీపీ నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గౌరీ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని వేదిక నుంచి కేకే రాజు, ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీని ఆయన కోరారు. మళ్ల.విజయప్రసాద్, బొడ్డేటి.ప్రసాద్, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల.చంద్రమౌళి, విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి మాజీ ఉడా డైరెక్టరు సురేష్, వైసీపీనేత ఆళ్ల.శివగణేష్ ఉన్నారు.


వైసీపీలో చేరిన వారితో కేకే రాజు

కంచరపాలెం: జగనన్నను రెండోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త,నాయకుడు పనిచేయాలని కె.కె.రాజు పేర్కొన్నారు. 48వార్డు పరిధి ఇందిరానగర్,జైభారత్ నగర్,బర్మాక్యాంప్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. చొక్కాకుల వెంకటరావు, వార్డు ఇన్‌చార్జి నీలి రవి పాల్గొన్నారు. బర్మాక్యాంప్ అయ్యప్ప నివాశుల సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం కె.కె.రాజు సమక్షంలో వైసీపీలో చేరారు.

సీతమ్మధార: 53వ వార్డు బీజేపీ మాజీ అధ్యక్షురాలు కె.భారతి ఆధ్వర్యంలో పలువురు వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో భారతితో పాటు గిరిజారాణి, బృంద, కరుణ, వినయ్, గోవిందరాజు, ప్రవీణ్, జగదీష్, యశ్వంత్, శ్రీనివాస్, ప్రసాద్, దిలీప్, కుమార్, రాజు ఉన్నారు.

పెందుర్తి జనసంద్రం

... 5వ పేజీ తరువాయి

హోరెత్తించారు. మహిళలు, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ పవన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తూటాల్లాంటి మాటలతో వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. శ్రీశ్రీ, శేషాద్రి కవితలతో ఓటర్లను చైతన్యపరస్తూ, వైసీపీ అరాచకాలను ఎండగడుతూ ప్రసంగించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో సునామీరాబోతుందన్నారు.

పగిలే కొద్దీ గాజు పదునెక్కుతుంది

గాజు పగిలే కొద్దీ పదునెక్కుతుందని..ప్రజల్ని పీడిస్తున్న జలగ జగన్‌ను గద్దె దించేందుకు తాను తగ్గి కూటమి కట్టానన్నారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకున్నారన్నారు. ప్రజాధనాన్ని రాబందుల్లా దోచేస్తున్న జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి ఆగడాలకు అంతం పలకాలని యువతకు పిలుపునిచ్చారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

జగదాంబ కూడలి, మే 1: కూటమి ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా స్పందన కనిపిస్తుందని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరావు అన్నారు. ఇటీవల మేనిఫెస్టో విడుదల చేసిన నేపథ్యంలో బుధవారం దుర్గాలమ్మగుడి మెయిన్ రోడ్డులో టీడీపీ అధి నేత చంద్రబాబు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలభిషేకం చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి మేనిఫెస్టోలో ప్రాధాన్యం కల్పించారంటూ నినాదాలు చేశారు. వార్డు పరిధిలోని పూర్ణామార్కెట్ , పండావీధి, దుర్గాలమ్మ గుడి ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. మేనిఫెస్టో ప్రతులను ప్రజలకు అందజేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిలి అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల్లో ఆనవాయితీగా భిన్నంగా ఆయన రెండోసారి భీమిలి నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు...

ప్రశ్న: మీకుటికెట్ ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే చీపురుపల్లికి వెళ్లమన్నారా?

గంటా: అదంతా దుష్ప్రచారం. విజయనగరం జిల్లాలో పార్టీ పరిస్థితి బాగున్నా లీడ్ చేసే నాయకుడు లేరని, అందుకే అక్కడకు వెళ్లాలని చంద్రబాబు చెప్పారు. ఒక జిల్లా నుంచి వేరే జిల్లాకు వెళ్లి పోటీ చేయమన్నారంటే అది ఒక విధంగా ఎలివేషన్. అక్కడ కూడా గెలవగలననే పెద్దల నమ్మకం. వారు సర్వేలు కూడా చేయించుకున్నారు. గెలుస్తానని నివేదిక వచ్చింది. అందుకే పట్టుబట్టి వెళ్లమన్నారు.

ప్ర: భీమిలి టికెట్‌కు వారిని ఎలా ఒప్పించారు?

గంటా: చీపురుపల్లి వెళ్లి రావాలంటే 150 కి.మీ. అంత దూరంగా ప్రయాణం కష్టం. అదీ కాకుండా చాలా తక్కువ సమయం ఉంది. భీమిలి పైన ఇంట్రెస్ట్ ఎక్కువగా ఉంది. నా మిత్రులు అందరితో మాట్లాడితే...ఇక్కడి నుంచే పోటీ చేయమన్నారు. భీమిలి నియోజకవర్గ ప్రజలు, నాయకులు కూడా ఆహ్వానించారు. ఇదే విషయమై బాబును, లోకేశ్‌ను నాలుగుసార్లు కలిశా. తప్పదంటే చీపురుపల్లి వెళతానని, లేదంటే భీమిలే ఖరారు చేయాలని కోరా. దాంతో వారు చివరకు నన్నే ప్రకటించారు.

ప్ర: భీమిలికి ఏమి చేయాలని మీ ఆలోచన?

గంటా: దేశంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు భీమిలి పరిసరాల్లో సెటిల్ అవుతున్నారు. ఇది అది పెద్ద నియోజకవర్గం. 3.6 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. హ్యాపినింగ్ ప్లేస్. విశాఖపట్నం-భోగాపురం విమానాశ్రయాల మధ్య ఉన్న పట్టణం. ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ ఇలా అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. భీమిలి అభివృద్ధికి ఓ విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తాం. అలాగే ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ కూడా తయారుచేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తాం. చిల్లపేటను ట్యాంక్ బండ్‌గా మార్చాలని గతంలోనే చంద్రబాబు చెప్పారు.

ప్ర: జగన్మోహన్‌రెడ్డి తాను గెలిస్తేవిశాఖనుంచే పరిపాలన అంటున్నారు?

గంటా: విశాఖలో పరిపాలనా రాజధాని అనేది ఒక ట్రాష్. మూడు రాజధానుల బిల్లు చెల్లదు. దానిపై న్యాయస్థానంలో కేసులు ఉన్నాయి. అవి తేలకుండా విశాఖను రాజధానిగా మార్చలేరు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అంతా ఇదిగో వస్తున్నారు..అదిగో వస్తున్నారని ప్రచారం చేశారు. ఉగాది, దసరా, దీపావళి, సంక్రాంతి ఇలా అన్ని పండుగలు అయిపోయాయి. జగన్ విశాఖ రావడం అనేది...గోడపై 'రేపు' అని రాసుకోవడం లాంటిదే. ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారు. విశాఖ ప్రశాంత నగరం.పులివెందులఫ్యాక్షన్, కడప రాజకీయాలుచూసి భయపడిపోతున్నారు.

ప్రశ్న: మీరు గెలిస్తేరుషికొండపై సీఎం క్యాంపు కార్యాలయం ఏమి చేస్తారు?

గంటా: రుషికొండపై టూరిజం గెస్ట్‌హౌస్ కూలగొట్టి సీఎం క్యాంప్ ఆఫీసు నిర్మించుకున్నారు. ఆ విషయాన్ని వారు ధైర్యంగా చెప్పుకోలేకపోతున్నారు. ఇప్పటికీ పర్యాటక శాఖ కోసమే నిర్మించామని అబద్ధాలు చెబుతున్నారు. దానిని చూడడానికి ఎవరినీ అనుమతించడం లేదు. ఆ భవనంలో ఖరీదైన వస్తువులు ఉన్నాయని, ఆడంబరంగా కట్టించుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఎలా ఉపయోగించుకుంటే బాగుంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న: భీమిలిలో మిత్రుడైన ముత్తంశెట్టితోనే పోటీ పడుతున్నారు? దీనిపై ఏమంటారు?

గంటా: భీమిలి ప్రజలు బలంగా కోరుకున్నందునే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నా. పోటీ చేసే ప్రతి ఒక్కరూ గెలుస్తామనే విశ్వాసంతోనే ఉంటారు. ఓడిపోతామని ఎవరూ చెప్పరు. నా విజయంపై నాకు ఎలాంటి అనుమానం లేదు. ఎవరైతే బాగుంటుందో భీమిలి ప్రజలే నిర్ణయిస్తారు.

ప్రశ్న: విశాఖ అభివృద్ధిపై?

గంటా: చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విశాఖకు చాలా ప్రాధాన్యం ఇచ్చారు. వాస్తవానికి హుద్‌హుద్ తరువాత విశాఖ రూపురేఖలే మారిపోయాయి. నగరాన్ని పునర్నిర్మాణం చేశారు. రియల్ బూస్టింగ్ ఇచ్చింది చంద్రబాబే. అది చూసే విశాఖలో అన్నీ ఉన్నాయి..ఇంకేమీ అవసరం లేదు..ఇక్కడే రాజధాని పెడతాం అని జగన్ అంటున్నారు. వైసీపీ బస్టాపులు కూడా సరిగ్గా నిర్మించలేకపోయింది. అదీ వారి ఘనత.

కూటమి అభ్యర్థులకు మద్దతు

» తెలగ, బలిజ , కాపు దక్షిణ భారత యాక్షన్ కమిటీ కన్వీనర్ రాము


మాట్లాడుతున్న దాసరిరాము

డాబాగార్డెన్స్, మే 1: ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని తెలగ, బలిజ , కాపు దక్షిణ భారతదేశ యాక్షన్ కమిటీ కన్వీనర్ దాసరి రాము కోరారు. బుధవారం డాబాగార్డెన్స్ జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థిని వంశీకృష్ణను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే కూటమి విజయం సాధించాలన్నారు. ఆ దిశగా తాము మద్దతిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్ ప్రజలకు సేవ చేసేందుకు కోట్లాది రూపాయలను కాదని రాజకీయాల్లో వచ్చారన్నారు. అటువంటి నాయకులు చట్టసభల్లో ఉంటే అందరికీ మేలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ము ద్రగడ పద్మనాభం కులనాయకుడు కాదని రాజకీయవేత్తగానే భావించాలన్నారు. గతంలో సినీనటుడు చిరంజీవి పోటీ చేసినప్పుడు ఆయనకు సహకరించలేదని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు

... 5వ పేజీ తరువాయి

ఎక్కడికక్కడే భూములు ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

కరప్షన్ కింగ్ అదీప్‌రాజ్

గత ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గ ఓటర్లు యువకుడైన అదీప్‌రాజ్ మేలు చేస్తాడని గెలిపిస్తే కరప్షన్ కింగ్‌గా మారాడని పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్రస్థాయిలో జగన్ దోచుకుంటే, నియోజకవర్గ స్థాయిలో అతను దోచేస్తున్నా డన్నారు. ఈ ప్రాంతంలో ఫ్లాట్ కొనాలన్నా అదీప్‌రాజ్ మనుషులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాల్సిందిగా ప్రజలు కోరుతున్నా జగన్ పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బాధ్యతను తీసుకుంటామని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలు రావాలని, కానీ, ఆ పరిశ్రమల వల్ల ఎవరూ బలి కాకూడదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇక్కడి ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపించకుండా..కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నాడన్నారు. అదీప్‌రాజ్ ఓటు అడగానికి వస్తే గెట్ లాస్ట్ అదీప్, గెట్ లాస్ట్ జగన్...అని చెప్పాలని పవన్ సూచించారు. పెందుర్తిలో చట్టాలు, రాజ్యాంగం లేదా..? అని ప్రశ్నించిన పవన్.. అదీప్‌రాజ్ నువ్వు జస్ట్ ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని, అసెంబ్లీలో ఈ ప్రాంత గళం వినిపిస్తానని పవన్ స్పష్టంచేశారు. చెత్త పన్నును చెత్తలో పడేస్తామని, చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో పడేద్దామని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేసే బాధ్యత మాదీ

మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసే బాధ్యత తమదని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. ఉమ్మడి మేనిఫెస్టోను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా రూపొందించామన్నారు. ఎంపీగా సీఎం రమేష్‌ను, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని, వీరిద్దరితో పని చేయించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

పాటలు పాడిన పవన్..

పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన నాన్న... ఎస్ఐగా చూడాలన్నది ఆయన కోరిక.. ఏమవ్వాలో నాకు చెప్పలేదు.. చదివే వాడిని కాని.. ఏం అవ్వాలో తెలియదు.. యాక్టింగ్ స్కిల్ నేర్పించి ఈ స్థాయికి వచ్చేలా అన్న చిరంజీవి చేశాడు' అని పవన్ పేర్కొన్నారు. చిరంజీవి తనకు యాక్టింగ్ స్కిల్‌ను సత్యానంద్ మాస్టార్ దగ్గర ఇదే విశాఖలో నేర్పించాడన్న పవన్.. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా... సీకాకులం చిట్టడవిలోనికి..ఏం పిల్లడో ఎల్దమొస్తవా..', 'బైబైయే బంగారు రవణమ్మ.. జమ్ జమ్మల్దారీ..' పాట, ఆట, నటన అన్నీ నేర్పిస్తే, మీరు గుండెల్లో పెట్టుకుంటే పవన్ కల్యాణ్ అయ్యాడు' అని స్పష్టం చేశారు. ఇంటి పెద్దగా ఉన్న చిరంజీవి తనలోని ప్రతిభను గుర్తించి శిక్షణ ఇప్పిస్తే... డబ్బులు సంపాదించి కౌలు రైతులకు సాయం చేసే స్థాయికి పవన్ చేరాడన్నారు. చిరంజీవి వంటి పెద్దన్న పాత్రను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని, అటువంటి ఆణిముత్యాలను గుర్తించి వెలికితీసేలా ప్రతిభ గణాంకాలు తీయాలని చంద్రబాబునాయుడుకు సూచించినట్టు పవన్ వెల్లడించారు. యువకుల్లోని ప్రతిభను బయటకు తీస్తామన్నారు.

క్రీడా ప్రాంగణాలన్నీ ప్రైవేటుకు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

వ్యక్తికి లీజుకు అప్పగించారు. లీజుకు దక్కించుకున్న వ్యక్తి అక్కడ సాధన చేసేందుకు భారీగా ఫీజులు నిర్ణయించడంతో సాధారణ, మధ్య తరగతికి చెందిన క్రీడాకారులు అటు వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహించలేని పరిస్థితి ఏర్పడింది. జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేసే లక్ష్యంతో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనాను చివరకు జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడానికన్నట్టు మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అలాగే బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్స్‌లో రెండు స్విమ్మింగ్‌పూల్స్ ఉన్నాయి. వీటిని జీవీఎంసీయే నిర్వహిస్తూ వచ్చింది. పెద్దవారికి నెలకు రూ.200, చిన్నారులకు రూ.వంద చొప్పున ఫీజు తీసుకునేవారు. నామమాత్రపు ఫీజు కావడంతో ఎంతోమంది స్విమ్మింగ్‌లో సాధన చేసేవారు. అక్కడ సాధన చేసిన వారిలో ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. కరోనా సమయంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మూతపడింది. తర్వాత దాదాపు రూ.2.5 కోట్లు వెచ్చించి ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆధునీకరించారు. ఇది అందుబాటులోకి వస్తే ఎంతోమంది తిరిగి స్విమ్మింగ్ సాధన చేసేందుకు అవకాశం ఉంటుందని అందరూ ఆశపడ్డారు. చివరకు ఆక్వాస్పోర్ట్స్ ఎరీనా నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని జీవీఎంసీ నిర్ణయించింది. దీనిపై క్రీడాకారులు, క్రీడా సంఘాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు, అభ్యంతరాలు వ్యక్తమవ్వడంతో అధికారులు కొంతకాలం ఆ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టారు. తర్వాత ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో జీవీఎంసీ నిర్ణయించిన ఫీజులు, తర్వాత సమయాల్లో నిర్వాహకులకు నచ్చిన మొత్తంలో ఫీజులు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ప్రైవేటుకు అప్పగించేశారు.

మద్దిలపాలెం సమీపంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పరిస్థితి కూడా అలాగే తయారైంది. దశాబ్దాలుగా స్టేడియంలో వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళ బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్ సాధన చేస్తుంటారు. వీరిలో పిల్లలతోపాటు పెద్దలు కూడా ఉంటారు. పిల్లలకు నిపుణులైన కోచ్‌లు మెలకువలు నేర్పుతూ వారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేస్తున్నారు. వీరంతా ఏడాదికి రూ.వెయ్యి చొప్పున జీవీఎంసీకి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే నగర నడిబొడ్డున ఉండడం, స్టేడియంలో ఓపెన్‌స్పేస్ కూడా ఉండడంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తుల కన్ను పడింది. స్టేడియం నిర్వహణను దక్కించుకుంటే భారీగా సంపాదించవచ్చునని భావించారు. దీంతో స్టేడియాన్ని ఆధునికీకరించి తమకు లీజుకు అప్పగించాలని జీవీఎంసీ అధికారులను కోరినట్టు సమాచారం. ఈ మేరకు వైసీపీ నేతల నుంచి ఒత్తిడి రావడంతో ఆగమేఘాల మీద స్వర్ణభారతి స్టేడియం ఆధునికీకరణ పనులకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తీసుకుని, వెంటనే పనులు మొదలుపెట్టేశారు. స్వర్ణభారతి స్టేడియాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించబోతున్నారనే ప్రచారం జరగడంతో అబ్బే ఇప్పట్లో అలాంటి ఆలోచన లేదంటూ అధికారులు ప్రకటన జారీచేశారు. కానీ ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో స్టేడియం నిర్వహణపై నిర్ణయం వాయిదా పడిందనే అభిప్రాయం క్రీడా సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. నగరంలో క్రీడాకారులను తయారుచేసేందుకు, ప్రతిభ కలిగిన వారికి ప్రోత్సాహం ఇచ్చేందుకు కృషిచేయాల్సిన జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆదాయమే ధ్యేయం అన్నట్టు వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

తాగునీటికి కటకట

... 5వ పేజీ తరువాయి

కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. అనంతరం టీఎస్ఆర్ రిజర్వాయర్‌లో మిగిలివున్న నీటిని జీవీఎంసీ ట్యాంకర్లకు నింపి, నిర్దేశిత ప్రాంతాలకు తరలించి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఆ తర్వాత కూడా నీరు మిగిలి ఉంటేనే హోటళ్లు, లాడ్జీలతోపాటు ప్రైవేటు బుకింగ్‌లకు సరఫరా చేసే ట్యాంకర్లకు అందజేస్తున్నారు.

ప్రతి కిలోలీటర్‌కు ప్రైవేటు ట్యాంకర్లు రూ.40 చొప్పున జీవీఎంసీకి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 1,500 కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన 500 ప్రైవేటు ట్యాంకర్లు, వంద కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన 1,500 ట్యాంకర్ ఆటోలు నిత్యం టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి నీటిని సరఫరా చేస్తుంటాయి. అయితే గత రెండు రోజులుగా టీఎస్ఆర్ రిజర్వాయర్‌లోని పంపుల వద్ద నీటి లభ్యత తగ్గిపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లకు నీటిని ఇవ్వడం లేదు. దీంతో ఇక్కట్లు మొదలయ్యాయి. జీవీఎంసీ ట్యాంకర్లకు నింపిన తర్వాతే ప్రైవేటు ట్యాంకర్లకు అందిస్తుండడంతో అన్ని ట్యాంకర్లకు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద ప్రైవేటు ట్యాంకర్లు బారులు తీరిపోతున్నాయి. మంగళ, బుధవారాల్లో టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి వీఎంఆర్డీఏ సెంట్రల్ పార్కు సమీపంలోని తెన్నేటి విశ్వనాథం సర్కిల్ వరకూ రోడ్డుపై బారులు తీరి నిలిచిపోయాయి.



ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

నోటుకు ఓటు-అభివృద్ధికి చేటు

నగరమంతటా ప్రచారం చేస్తున్న గాంధీ గుడి సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ, మే 1: నోటుకు ఓటు-అభివృద్ధికి చేటు అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది గాంధీ గుడి సంస్థ. ఆటోలలో మైకుల ద్వారా ఈ నినాదాన్ని వినిపిస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నది. ఓటు హక్కు పదునైన ఆయుధం-సమర్థవంతంగా వినియోగించుకుందాం, ప్రతి ఓటు అమూల్యమైనదే-మన ఓటు కూడా అమూల్యమైనదే, ఓటు అన్నది హక్కు మాత్రమే కాదు రాజ్యాంగబద్ధమైన కర్తవ్యం, సారా చుక్క వద్దు-సిరా చుక్క ముద్దు, మీ నోటు మాకు వద్దు-మీ సేవలు మాకు ముద్దు, మేధావులు మౌనంగా ఉంటే మూర్ఖులు రాజ్యం ఏలుతారు, మద్యం మత్తు వద్దు-పచ్చ నోటూ వద్ద అన్న నినాదాలను మైకుల ద్వారా వినిపిస్తూ సంస్థ ప్రతినిధులు నగరంలోని అన్ని ప్రాంతాల్లోనూ బుధవారం నుంచి ప్రచారం సాగిస్తున్నారు. ఈ నెల పదో తేదీ వరకు ఈ ప్రచారాన్ని కొనసాగిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



ఉక్కుటౌన్‌షిప్, మే 1: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్)గా జీవీఎన్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉక్కు కర్మాగారంలో 1987లో విధుల్లో చేరిన ప్రసాద్ అంచెలంచెలుగా ఎదిగి జనరల్ మేనేజర్ (మార్కెటింగ్)గా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలో ఆయన డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. డైరెక్టర్ (కమర్షియల్)గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, మే 1: ఇక్కడి నరసింహనగర్, ఇందిరానగర్, చంద్రనగర్ ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేశ్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ఏరియా, లక్ష్మీనగర్, రామకృష్ణానగర్, కొత్తపాలెం, సంతోశ్‌నగర్, నాగేంద్ర కాలనీ, సూర్యనగర్, డీఏఆర్‌నగర్, గణపతినగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, మే 1: గ్రేటర్ 69వ వార్డు పరిధి తుంగ్లాం కాలనీలో నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటించడంతో పాటు త్వరితంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టరును ఆయన కోరారు. ఆయన వెంట పలువురు కాలనీ నాయకులు ఉన్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ రక్తదానం

వేపగుంట మే 1: జీవీఎంసీ జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సింహపురికాలనీ సమీపంలో ఉన్న వసుదేవ ఫంక్షన్ హాల్‌లో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రామరాజు మాట్లాడుతూ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజానికి తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతోనే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో 120 మంది రక్తదానం చేశారు. అసోసియేషన్ ప్రతినిధలుఉ ఎల్.శ్రీనివాసరావు, రమణా రెడ్డి, అజిత్, రమణయ్య, శ్రీనివాస్, హరిప్రసాద్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 23,వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 22, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 144, మునక్కాడలు (కిలో) 34, బరబాటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 28, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 48, కీరదోస 28, క్యాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ IIIలో..



పాత గోపాలపట్నంలో మాట్లాడుతున్న గణబాబు



వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు, 'పల్లా'

కూటమి విజయం చారిత్రక అవసరం

టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పి.గణబాబు, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాస్

మల్కాపురం, మే 1: వైసీపీ పాలనలో రాష్ట్రం ఛిన్నాభిన్నమైందని, ఈ పరిస్థితుల్లో ఏపీ గాడిలో పడాలంటే కూటమి అభ్యర్థుల విజయం చారిత్రక అవసరమని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, పి.గణబాబు, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావులు పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల (40,58 నుంచి 63) యాదవ కుల సంఘాలతో బుధవారం పిలకవానిపాలెం జంక్షన్‌లో ఉన్న వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలంతా ఆనందంగా ఉండాలన్నా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. అందువల్ల కూటమి అభ్యర్థుల గెలుపు కోసం అందరూ సహకరించాలని కోరారు. కూటమి మేనిఫెస్టో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసేలా ఉందని, దీనిని చూసి వైసీపీ నాయకులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. మరికొద్ది రోజుల్లో వైసీపీ పాలనకు నూకలు చెల్లినట్టేనన్నారు. ఈ సమావేశం టీడీపీ 61వ వార్డు అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మి అధ్యక్షతత జరగ్గా, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. అలాగే 59వ వార్డు హిమచల్‌నగర్‌లో సాయంత్రం గణబాబు రోడ్ షో నిర్వహించారు.

టీడీపీ మేనిఫెస్టోతో ప్రజలందరికీ మేలు

గోపాలపట్నం: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి దోహద పడాలని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. 91వ వార్డు పరిధి పాత గోపాలపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోతో రాష్ట్రాభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అందువల్ల మే 13న జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో పత్రాలను అందించారు. కాగా 90వ వార్డు పరిధి వినోద్‌నగర్, ఎస్‌ఏడీ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన పలువురు గణబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే గోపాలపట్నానికి చెందిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎన్.ఎ.డి.జంక్షన్: సార్వత్రిక ఎన్నికల్లో విద్యావంతులంతా విజ్ఞతతో ఆలోచించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని 'పశ్చిమ' అభ్యర్థి పి.గణబాబు కోరారు. 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీలోని కాలనీ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని విద్యావంతులంతా రాష్ట్రంతో పాటు యువత భవిషత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలపించాలన్నారు. గణబాబు సతీమణి మాధవీలత కాలనీలోని మహిళలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు, సూర్యనారాయణ, అనిల్‌కుమార్, ప్రసాదరెడ్డి, భాస్కర రెడ్డి, త్రినాథ్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.



52వ వార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆదారి ఆనంద్‌కుమార్



91వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

'పశ్చిమ'లో వైసీపీ జెండా ఎగురవేయాలి

సీఎం జగన్ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్



యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 1: పశ్చిమ నియోజకవర్గంలో ఈసారి తప్పకుండా వైసీపీ జెండా ఎగురవేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయవలసిందిగా వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ కోరారు. 52వ వార్డు పరిధి కరాస శ్రీదుర్గా వేమన భవనంలో జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అమలు చేయాల్సిన ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. సీఎం జగన్ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళాలన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పటికే ఆదారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఆయన గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ పశ్చిమ పరిశీలకులు ఎస్‌ఏ రెహమాన్, పేడాడ రమణికుమారి, నాయకులు ఆల్ఫా కృష్ణ, జియ్యాని మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తా

గోపాలపట్నం: ఎటువంటి పదవి లేకపోయినా వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్తగా ఉంటూ నియోజకవర్గంలో రూ.230 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టానని, తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే 'పశ్చిమ'ను మరింతగా అభివృద్ధిపథంలో నడిపిస్తానని ఆయనన్నారు. 91వ వార్డు పరిధి గోపాలపట్నం, రామకృష్ణానగర్, లక్ష్మీనగర్, ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు గాను చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మే 13న జరగనున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు వైసీపీ గుర్తింపునిచ్చింది..

వైసీపీ ప్రభుత్వం యాదవ కులస్తులకు ఎంతో గుర్తింపునిచ్చిందని, ఏ ప్రభుత్వం కూడా వారిని అంతగా గుర్తించలేదని ఆదారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. పిలకవానిపాలెం జంక్షన్ సమీపంలో గల వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి పారిశ్రామిక ప్రాంత యాదవులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యాదవులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గొల్లలకు ప్రత్యేక దర్శనం ఉండేదని, నాడు వివిధ కారణాల వల్ల దానిని నిలిపివేశారని, అయితే జగన్ సీఎం అయ్యాక యాదవులకు శ్రీవారి తొలి దర్శనం చేసేలా ఏర్పాట్లు చేశారన్నారు. అందువల్ల యాదవులందరూ వైసీపీతో నడవాలని కోరారు. నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తి స్థాయిలో అవగహన ఉందని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వాటిని పరిష్కరిస్తానన్నారు. పలువురు యాదవులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాదవ సంఘాల ప్రతినిధులు గొలగాని శ్రీనివాస్, ఉరుకూటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ 63వ వార్డులో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వైసీపీ నాయకులు పి.రామ్మోహన్‌రెడ్డి, ఎస్.సురేష్, బి.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్మిక దినోత్సవం



పెదగంట్యాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టాలిన్



కార్మిక జెండా ఎగరవేసిన ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ



ఎన్ఎస్‌టీఎల్ కాంట్రాక్టు కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూనియన్ సభ్యులు

ఉక్కుటౌన్‌షిప్, మే 1: మే డే వేడుకలను బుధవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో ఉక్కు గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ జెండా ఎగురవేయగా అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, మసేన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఇంటక్ కార్యాలయంలో మంత్రి రాజశేఖర్ జెండా ఎగురవేయగా నాయకులు నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. యూజ్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి, సీపీఐ నాయకుడు బి.వెంకటరావులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఉక్కు నాయకులు జె.అయోధ్యరాం, యు.రామస్వామి, వైటీ దాసు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: శ్రీహరిపురం కోరమాండల్ గేటు వద్ద వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆదారి ఆనంద్‌కుమార్ కేక్ కట్ చేసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన వైఎస్సార్‌టీయూసీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేశ్, నాయకులు రాయపురెడ్డి అనిల్, భూపతి, రమణరెడ్డి, పి.మల్లేశ్, హనుమంతరావు, సుందరరావు, చిన్నరెడ్డి, అశోక్, తదితరులు పాల్గొనారు. అలాగే స్థానిక హిమాచల్‌నగర్ వద్దనున్న టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు కేక్ కట్ చేశారు. కోరమాండల్ గేటు వద్ద విశాఖపట్నం కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జెవీ సత్యనారాయణమూర్తి (నాని) ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎన్ఎస్‌టీఎల్ కాంట్రాక్టు కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జేఎస్ వర్మ, సభ్యులు ఆలోక్‌కుమార్ చంద్, గౌరవ్‌కుమార్ ప్రజాపతి, దీపక్ కుమార్ పాశ్వాన్, కొల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: శ్రామిక హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ అన్నారు. మేడే సందర్భంగా పెదగంట్యాడలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో ఆయన జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, జె.రామకృష్ణ, జి.ఆనంద్, పి.దుర్గారావు, విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కూడలిలో స్టీల్‌ప్లాంట్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మసేన్ రావు పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు వై.శ్రీనివాసరావు, పోలయ్య, ఎస్.శ్రీనివాసరావు, తాతారావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఉక్కు ముఠా కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో భాగంగా టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు సోంబాబు, ఎస్ఎస్ విజయరామరాజు, బెల్లంకొండ రాజన్ రాజు, వి.రాంబాబు, డీవీ అప్పారావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. 86వ వార్డు సిద్ధార్థనగర్ కాలనీలో శ్రీరామ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మునిసిపల్ మాజీ చైర్మన్ వీవీఎన్ఎం రాజా, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. 71వ వార్డు శ్రీనగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనసేన నాయకుడు కరణం కనకారావు విచ్చేసి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం: బెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన మే డే వేడుకల్లో సీనియర్ కార్మికుడు పడాల రమణ యూనియన్ పతాకాన్ని ఎగరవేశారు. నాయకులు కొల్లి దేముడు, పీవీఎన్ రాజు, ఎస్.సాహు, బి.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. బెల్ సీఐటీయూ ఆధ్వర్యంలో కంపెనీ మెయిన్‌గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఆర్.జనార్ధనరావు పతాకావిష్కరణ చేయగా నాయకులు ప్రకాశ్, జగన్నాథరావు, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట, మే 1: నాయడుతోట రవినగర్‌లోని శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రవణా నక్షత్రం పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామున నాలుగున్నరకు శ్రీవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాతలకు అర్చకులు శ్రీనివాసస్వామి శ్రీవారి జ్ఞాపికను అందజేశారు.

'రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం'

అగనంపూడి, మే 1: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని 79వ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. బుధవారం షిర్డీసాయి నగర్, గల్లవానిపాలెం పరిసర ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు వైసీపీ అరాచకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు కరణం, సత్యారావు, కె.జగదీశ్, బుల్లెట్ రాజు, సింగిడి సింహాచలం, తాతారావు, వెంకటరావు, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే టీడీపీ ధ్యేయం

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్



జెండా ఎగురవేసిన పల్లా శ్రీనివాసరావు. చిత్రంలో శ్రీభరత్, తదితరులు ఉన్నారు

గాజువాక, మే 1: కార్మిక సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మే డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని భావించి కార్మికుల కోసం టీడీపీ హయాంలో ఎన్నో సంక్షేమ పనులు చేపట్టడం జరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కార్మికులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటిత, అసంఘటిత కార్మికులను అన్ని విధాల మానసిక ఇబ్బందులకు వైసీపీ గురిచేసిందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు కార్మికులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోన తాతారావు, ప్రసాదుల శ్రీనివాస్, కోగంటి లెనిన్‌బాబు, విళ్లా రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారు మద్దతివ్వడం ఆనందంగా ఉంది



పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావును స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ టీమ్ తారక్ సభ్యులు రాష్ట్ర ఫ్యాన్స్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో గాజువాకలోని పార్టీ కార్యాలయంలో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ తనకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గాజువాకలో గుడ్డు మంత్రికి మద్దతుగా కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గాజువాక ప్రజలకు అందుబాటులో లేని వ్యక్తి, అనకాపల్లిని దోచేసిన గుడ్డు మంత్రికి నియోజకవర్గ ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పేందుకు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ అధ్యక్షుడు రాము, మధు, గణపతి, శ్రీను, వాసు, శివరాం, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు అంతం పలుకుదాం

కూర్మన్నపాలెం: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీకి అంతం పలుకుదామని టీడీపీ గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వడ్లపూడిలో బుధవారం రాత్రి కణితి శెట్టిబలిజ వీధిలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో బలిజలకు వెన్ను తట్టి ప్రోత్సహిస్తే, వైసీపీ ప్రభుత్వం వారికి వెన్నుపోటు పొడిచిందిన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ గాజువాక ఎమ్మెల్యేగా పల్లాను, విశాఖ ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. సంఘ నాయకులు గెద్దాడ రాంబాబు, పి.కృష్ణ, అప్పారావు, అప్పన్న, అప్పలస్వామి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే జనరంజక పాలన

▸▸ జనసేన నాయకుడు పంచకర్ల వెంకటేశ్వరరావు



పైడివాడఅగ్రహారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పంచకర్ల వెంకటేశ్వరరావు

సబ్బవరం, మే 1 : రాష్ట్రంలో కూటమితోనే జనరంజక పాలన సాధ్యమని జనసేన నాయకుడు పంచకర్ల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అమృతపురం, పైడివాడఅగ్రహారంలలో కూటమి నేతలతో కలిసి ఆయన ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలను వివరించారు. వృద్ధులకు నెలకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు తదితర హామీలను వివరించారు. గండి వంశీ ప్రదీప్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజు గ్లాసుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటేసి గెలిపించాలని కోరారు. అదే విధంగా చిన్నయ్యపాలెం, సబ్బవరం, సాయినగర్ తదితర గ్రామాల్లో కూటమి శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించి, మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు.



ఎయిర్‌పోర్టులో భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

తెలంగాణ డిప్యూటీ సీఎంకు స్వాగతం

గోపాలపట్నం, మే 1: ఒడిశాలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొనడానికి విశాఖ విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం రాత్రి ఏడు గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆయనకు కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు చేరుకున్నారు. గురువారం ఉదయం ఆయన రోడ్డు మార్గం గుండా ఒడిశాలోని కోరాపుట్‌కు బయలుదేరి వెళతారు.

ఉక్కు కార్మికులకు సీఎం జగన్ చేసింది శూన్యం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం, మే 1: తన వల్ల మేలు జరిగితేనే ఓటు వేయండని సీఎం జగన్ చెబుతున్నారని.. స్టీల్‌ప్లాంట్ కార్మికుల కోసం ఐదేళ్ల ఏళ్ల పాలనలో ఆయన చేసింది శూన్యమని.. అలాంటప్పుడు వైసీపీకి ఉక్కు కార్మికులు ఎందుకు ఓటు వేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,174వ రోజుకు చేరాయి. మే డేను పురస్కరించుకుని శిబిరం వద్ద జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును నష్టాల్లోకి నెట్టేసి ఇప్పుడు నిస్సిగ్గుగా ఓట్లు అడగడానికి దసరా వేషగాళ్లు వస్తున్నారని విమర్శించారు. ఇరవైసార్లు ప్రధాని మోదీని కలిసిన జగన్ ఉక్కు ప్రైవేటీకరణపై మాట్లాడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికుల ఆది, తుది ఆకాంక్ష ఉక్కు కర్మాగార పరిరక్షణేనన్నారు. పోరాటాలతోనే కార్మికులంతా హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సురేశ్, శ్రీనివాస్, నరేంద్ర, జగ్గారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

- ఎంపీ అభ్యర్థి శ్రీభరత్
- దక్షిణంలో జనసేన అభ్యర్థి వంశీకృష్ణ విస్తృత ప్రచారం

అక్కయ్యపాలెం, మే 1: అర్హులందరికి ఇళ్లు కేటాయించాలన్నది రానున్న కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ తెలిపారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి బుధవారం గ్రేటర్ 27వ వార్డు డొండపర్తి రామాలయం జంక్షన్, దేవాంగులవీధిలో స్థానికులతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు నిత్యావసరాల పెరిగిన ధరలతోపాటు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, టిడ్కో ఇళ్ల పరిస్థితులపై అభ్యర్థులకు వివరించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గతంలో 12 లక్షల ఇళ్లు రాష్ట్రానికి మంజూరు చేస్తే టీడీపీ ప్రభుత్వం 5 లక్షలు పూర్తి చేసిందని, మిగిలినవి నిర్మాణదశలో ఉండగా ప్రభుత్వం దిగిపోవాల్సి వచ్చిందన్నారు. వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయక పేదల సొంతింటి కల సాకారం కాలేదన్నారు.కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అల్లిపురం: అల్లిపురం ఈతపేట రోడ్డుకు చెందిన అధిక సంఖ్యలో యువత బుధవారం వంశీకృష్ణ సమక్షంలోజనసేన పార్టీలో చేరారు. 32వార్డులో వంశీకృష్ణ సతీమణి పద్మజ విస్తృత ప్రచారం చేశారు. ఇం టింటికీ వెళ్లి వంశీకృష్ణ, శ్రీభరత్‌లకు ఓటువేసి గెలిపించాలని కోరారు. అధికార మార్పుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని విన్నవించారు.. కార్పొరేటర్ కం దుల నాగరాజు, వార్డు టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్, మే 1: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని దక్షిణ నియోజకవర్గ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 35వ వార్డు పూర్ణామార్కెట్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏవీఎన్ కాలేజీ వద్ద భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. టీడీపీ శ్రేణులు చిన్న రహమాన్, బొచ్చా రామిరెడ్డి, జనసేన నాయకులు పిల్లిరమణ, పూర్ణామార్కెట్ వర్తక సంఘం కార్యదర్శి, టీడీపీ నాయకుడు గంగాడ గోవింద్, పాల్గొన్నారు. వంశీ కృష్ణను గెలిపించాలంటూ ఆయన తనయుడు సందీప్ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. 36 వార్డులో పలుచోట్లపర్యటించారు.


మాట్లాడుతున్న శ్రీభరత్


32వ వార్డులో ప్రచారం చేస్తున్న వంశీకృష్ణ సతీమణి పద్మజ

పవన్ కల్యాణ్ సభను విజయవంతం చేయాలి

మద్దిలపాలెం: పూర్ణామార్కెట్ జంక్షన్ దుర్గాలమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించనున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బహిరంగ సభ విజయవంతం చేయాలని ఆ పార్టీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు, దక్షిణం కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శివాజీపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 6గంటలకు జరిగే పవన్ సభకు కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కూటమి అభ్యర్థులకు మద్దతు

- తెలగ, బలిజ , కాపు దక్షిణ భారత యాక్షన్ కమిటీ కన్వీనర్ రాము


మాట్లాడుతున్న దాసరిరాము

డాబాగార్డెన్స్, మే 1: ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని తెలగ, బలిజ , కాపు దక్షిణ భారతదేశ యాక్షన్ కమిటీ కన్వీనర్ దాసరి రాము కోరారు. బుధవారం డాబాగార్డెన్స్ జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దక్షిణ నియోజకవర్గ కూటమి అభ్యర్థిని వంశీకృష్ణను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే కూటమి విజయం సాధించాలన్నారు. ఆ దిశగా తాము మద్దతిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్ ప్రజలకు సేవ చేసేందుకు కోట్లాది రూపాయలను కాదని రాజకీయాల్లో వచ్చారన్నారు. అటువంటి నాయకులు చట్టసభల్లో ఉంటే అందరికీ మేలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ముద్రగడ పద్మనాభం కులనాయకుడు కాదని రాజకీయవేత్తగానే భావించాలన్నారు. గతంలో సినీనటుడు చిరంజీవి పోటీ చేసినప్పుడు అయనకు సహకరించలేదని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉత్తరాంధ్ర భూములు

... 5వ పేజీ తరువాయి

ఎక్కడికక్కడే భూములు ఆక్రమించుకుంటున్నారని ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు.

కరప్షన్ కింగ్ అదీప్‌రాజ్

గత ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గ ఓటర్లు యువకుడైన అదీప్‌రాజ్ మేలు చేస్తాడని గెలిపిస్తే కరప్షన్ కింగ్‌గా మారాడని పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్రస్థాయిలో జగన్ దోచుకుంటే, నియోజకవర్గ స్థాయిలో అతను దోచేస్తున్నా డన్నారు. ఈ ప్రాంతంలో ఫ్లాట్ కొనాలన్నా అదీప్‌రాజ్ మనుషులకు డబ్బులు చెల్లించాల్సి వస్తోందన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించాల్సిందిగా ప్రజలు కోరుతున్నా జగన్ పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బాధ్యతను తీసుకుంటామని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే పరిశ్రమలు రావాలని, కానీ, ఆ పరిశ్రమల వల్ల ఎవరూ బలి కాకూడదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇక్కడి ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని చూపించకుండా..కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నాడన్నారు. అదీప్‌రాజ్ ఓటు అడగానికి వస్తే గెట్ లాస్ట్ అదీప్, గెట్ లాస్ట్ జగన్..అని చెప్పాలని పవన్ సూచించారు. పెందుర్తిలో చట్టాలు, రాజ్యాంగం లేదా..? అని ప్రశ్నించిన పవన్.. అదీప్‌రాజ్ నువ్వు జస్ట్ ఎమ్మెల్యే మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని, అసెంబ్లీలో ఈ ప్రాంత గళం వినిపిస్తానని పవన్ స్పష్టంచేశారు. చెత్త పన్నును చెత్తలో పడేస్తామని, చెత్తపై పన్ను వేసిన ఈ ప్రభుత్వాన్ని కూడా చెత్తలో పడేద్దామని స్పష్టం చేశారు.

హామీలు అమలు చేసే బాధ్యత మాదీ

మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసే బాధ్యత తమదని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. ఉమ్మడి మేనిఫెస్టోను స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా రూపొందించామన్నారు. ఎంపీగా సీఎం రమేష్‌ను, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును గెలిపించాలని, వీరిద్దరితో పని చేయించే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు.

పాటలు పాడిన పవన్..

పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన నాన్న... ఎస్ఐగా చూడాలన్నది ఆయన కోరిక.. ఏమవ్వాలో నాకు చెప్పలేదు.. చదివే వాడిని కాని.. ఏం అవ్వాలో తెలియదు.. యాక్టింగ్ స్కిల్ నేర్పించి ఈ స్థాయికి వచ్చేలా అన్న చిరంజీవి చేశాడు' అని పవన్ పేర్కొన్నారు. చిరంజీవి తనకు యాక్టింగ్ స్కిల్‌ను సత్యానంద్ మాస్టార్ దగ్గర ఇదే విశాఖలో నేర్పించాడన్న పవన్.. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా... సీకాకులం చిట్టడవిలోనికి..ఏం పిల్లడో ఎల్దమొస్తవా..', 'భైభైయే బంగారు రవణమ్మ.. జమ్ జమ్మల్దారీ..' పాట, ఆట, నటన అన్నీ నేర్పిస్తే, మీరు గుండెల్లో పెట్టుకుంటే పవన్ కల్యాణ్ అయ్యాడు' అని స్పష్టం చేశారు. ఇంటి పెద్దగా ఉన్న చిరంజీవి తనలోని ప్రతిభను గుర్తించి శిక్షణ ఇప్పిస్తే.. డబ్బులు సంపాదించి కౌలు రైతులకు సాయం చేసే స్థాయికి పవన్ చేరాడన్నారు. చిరంజీవి వంటి పెద్దన్న పాత్రను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని, అటువంటి ఆణిముత్యాలను గుర్తించి వెలికితీసేలా ప్రతిభ గణాంకాలు తీయాలని చంద్రబాబునాయుడుకు సూచించినట్లు పవన్ వెల్లడించారు. యువకుల్లోని ప్రతిభను బయటకు తీస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- జై భారత్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనారాయణ


మహరాణిపార్లర్ వద్ద ప్రచారంలో లక్ష్మీనారాయణ

అక్కయ్యపాలెం, మే 1: సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జై భారత్ పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనారాయణ బుధవారం అక్కయ్యపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈప్రచారానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. మహారాణిపార్లర్ ప్రాంతంలో ఆయన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ... స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ప్రచారంలో పార్టీ నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

'ఎన్నికల భారతం' ఆవిష్కరణ

సీతమ్మధార, మే 1: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల భారతం పేరిట కవితా సంకలనం పుస్తకాన్ని పౌరగ్రంథాలయంలో నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ వి.బాలమోహన్‌దాస్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. కవితల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు.


వృద్ధులకు కరపత్రాలందిస్తున్న విష్ణుకుమార్‌రాజు


రామన్నకాలనీలో మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు. టీడీపీ నేతలు

కూటమి గెలుపుతోనే ప్రజల జీవితాల్లో వెలుగు

- ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు

మాధవధార, మే 1 ; తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపుతోనే ప్రజా జీవితాల్లో వెలుగులు నిండుతాయని విశాఖ ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెన్మెత్స. విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న గందరగోళ పరిస్థితులకు కారణమైన అధికార వైసీపీకి ప్రజలను ఓట్లు వేయమని అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని 51వవార్డులో మాధవధారలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. వార్డులోని రామన్నకాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో గడప గడపకి వెళ్లి కూటమి మేనిఫెస్టో ప్రయోజనాల్ని విష్ణుకుమార్ రాజు వివరించారు. ఈసందర్భంగా ఆయన దృష్టికి స్థానికులు పలు సమస్యల్ని తీసుకొచ్చారు. స్లమ్ ఏరియాల్లో మద్యానికి ఇంటి యజమానులు బానిసలవడంతో పాటు యువత వైసీపీ పాలనలో పెడదోవ పట్టారో మహిళలు విష్ణుకుమార్‌రాజు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన పాలన చేతకాని నేతలనుంచి ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. విశాఖకు ఏవిధంగా అన్యాయం జరిగిందో ఈ సందర్భంగా వివరించారు. ఈ విపత్కర పరిస్థిల నుంచి తిరిగి ఓటరు తన వజ్రాయుధంతోనే రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని పారదోలాలని అన్నారు. వైసీపీ పాలన విముక్తితోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ 51వవార్డు అధ్యక్షులు సనపల.కీర్తి, నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు మురళీనగర్‌లో 50వవార్డు ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో బుధవారం రాత్రి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యుల నిర్వహణలో జరిగిన సమావేశంలో విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు ఈ సందర్భంగా తమ మద్దతుని కూటమి అభ్యర్థులు తెలిపారు. అన్ని విధాలునష్టం చేకూర్చిన వైసీపీ సర్కారు ఓటమితోనే తిరిగి ప్రశాంత విశాఖను సాధించగలమని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.





అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఉత్తర నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కేకే రాజు


వైసీపీలో చేరిన వారితో కేకే రాజు

అక్కయ్యపాలెం, మే 1: చిరు వ్యాపారుల కోసం ఇనార్బిట్ మాల్ సమీపంలో ప్రత్యేక స్థలం కేటాయించి వ్యాపారాల అభివృద్ధికి మరింత తోడ్పడతానని ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. గ్రేటర్ 45వ వార్డు తాటిచెట్లపాలెం ఎనభై అడుగుల రోడ్డు సమీపాన ఎన్నికల కార్యాలయంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో వెజిటేబుల్ మార్కెట్ సంఘం సభ్యులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేకే రాజు హాజరై మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా పక్షపాతి అని అన్నారు. అనంతరం పలువురు చిరువర్తకులు వైసీపీలో చేరారు. దుర్గా వెజిటేబుల్ మార్కెట్ సంఘం అధ్యక్షుడు వెంకట సత్య నారాయణ, కార్యదర్శి రమణమ్మ, ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బానాల శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ 44వ వార్డు అబిద్‌నగర్ పార్కులో కేకే రాజు మార్నింగ్ వాక్ నిర్వహించారు. వాకర్స్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, రవీంద్రనాథ్ ఠాగూర్‌పాల్గొన్నారు.

వైసీపీకి గవరల సంపూర్ణ మద్దతు

మురళీనగర్; ఉమ్మడి విశాఖ జిల్లాలో గవరలు వైసీపీ అభ్యర్థుల గెలుపునకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు గవర సామాజిక వర్గ ప్రతినిధి, వైసీపీ నాయకులు బొడ్డేటి.కాశీవిశ్వనాథం పేర్కొన్నారు. బుధవారం రాత్రి మురళీనగర్ బొత్స స్క్వేర్‌లో జరిగిన వైసీపీ నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ గౌరీ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని వేదిక నుంచి కేకే రాజు, ఎంపీ అభ్యర్థి బొత్సఝాన్సీని ఆయన కోరారు. మళ్ల.విజయప్రసాద్, బొడ్డేటి.ప్రసాద్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ సనపల.చంద్రమౌళి, విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి మాజీ ఉడా డైరెక్టరు సురేష్, వైసీపీనేత ఆళ్ల.శివగణేష్ ఉన్నారు.

కంచరపాలెం: జగనన్నను రెండోసారి సీఎంను చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త,నాయకుడు పనిచేయాలని కె.కె.రాజు పేర్కొన్నారు. 48వార్డు పరిధి ఇందిరానగర్,జైభారత్ నగర్,బర్మాక్యాంప్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. చొక్కాకుల వెంకటరావు, వార్డు ఇన్‌చార్జి నీలి రవి పాల్గొన్నారు. బర్మాక్యాంప్ అయ్యప్ప నివాశుల సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం కె.కె.రాజు సమక్షంలో వైసీపీలో చేరారు.

సీతమ్మధార: 53వ వార్డు బీజేపీ మాజీ అధ్యక్షురాలు కె.భారతి ఆధ్వర్యంలో పలువురు వైసీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో భారతితోపాటు గిరిజారాణి, బృంద, కరుణ, వినయ్, గోవిందరాజు, ప్రవీణ్, జగదీష్, యశ్వంత్, శ్రీనివాస్, ప్రసాద్, దిలీప్, కుమార్, రాజు ఉన్నారు.

పెందుర్తి జనసంద్రం

... 5వ పేజీ తరువాయి

హోరెత్తించారు. మహిళలు, కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ పవన్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తూటాల్లాంటి మాటలతో వైసీపీ అధినేత జగన్‌పై ధ్వజమెత్తారు. శ్రీశ్రీ, శేషాద్రి కవితలతో ఓటర్లను చైతన్యపరుస్తూ, వైసీపీ అరాచకాలను ఎండగడుతూ ప్రసంగించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో రాష్ట్రంలో సునామీరాబోతుందన్నారు.

పగిలే కొద్దీ గాజు పదునెక్కుతుంది

గాజు పగిలే కొద్దీ పదునెక్కుతుందని..ప్రజల్ని పీడిస్తున్న జలగ జగన్‌ను గద్దె దించేందుకు తాను తగ్గి కూటమి కట్టానన్నారు. ప్రజలు భయం గుప్పిట్లో బతుకున్నారన్నారు. ప్రజాధనాన్ని రాబందుల్లా దోచేస్తున్న జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డి ఆగడాలకు అంతం పలకాలని యువతకు పిలుపునిచ్చారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

జగదాంబ కూడలి, మే 1: కూటమి ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా స్పందన కనిపిస్తుందని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరావు అన్నారు. ఇటీవల మేనిఫెస్టో విడుదల చేసిన నేపథ్యంలో బుధవారం దుర్గాలమ్మగుడి మెయిన్ రోడ్డులో టీడీపీ అధి నేత చంద్రబాబు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలభిషేకం చేశారు. అన్ని వర్గాల సంక్షేమానికి మేనిఫెస్టోలో ప్రాధాన్యం కల్పించారంటూ నినాదాలు చేశారు. వార్డు పరిధిలోని పూర్ణామార్కెట్ , పండావీధి, దుర్గాలమ్మ గుడి ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. మేనిఫెస్టో ప్రతులను ప్రజలకు అందజేశారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిలి అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల్లో ఆనవాయితీగా భిన్నంగా ఆయన రెండోసారి భీమిలి నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు...

ప్రశ్న: మీకుటికెట్ ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే చీపురుపల్లికి వెళ్లమన్నారా?

గంటా: అదంతా దుష్ప్రచారం. విజయనగరం జిల్లాలో పార్టీ పరిస్థితి బాగున్నా లీడ్ చేసే నాయకుడు లేరని, అందుకే అక్కడకు వెళ్లాలని చంద్రబాబు చెప్పారు. ఒక జిల్లా నుంచి వేరే జిల్లాకు వెళ్లి పోటీ చేయమన్నారంటే అది ఒక విధంగా ఎలివేషన్. అక్కడ కూడా గెలవగలననే పెద్దల నమ్మకం. వారు సర్వేలు కూడా చేయించుకున్నారు. గెలుస్తానని నివేదిక వచ్చింది. అందుకే పట్టుబట్టి వెళ్లమన్నారు.

ప్ర: భీమిలి టికెట్‌కు వారిని ఎలా ఒప్పించారు?

గంటా: చీపురుపల్లి వెళ్లి రావాలంటే 150 కి.మీ. అంత దూరంగా ప్రయాణం కష్టం. అదీ కాకుండా చాలా తక్కువ సమయం ఉంది. భీమిలి పైన ఇంట్రెస్ట్ ఎక్కువగా ఉంది. నా మిత్రులు అందరితో మాట్లాడితే...ఇక్కడి నుంచే పోటీ చేయమన్నారు. భీమిలి నియోజకవర్గ ప్రజలు, నాయకులు కూడా ఆహ్వానించారు. ఇదే విషయమై బాబును, లోకేశ్‌ను నాలుగుసార్లు కలిశా. తప్పదంటే చీపురుపల్లి వెళతానని, లేదంటే భీమిలే ఖరారు చేయాలని కోరా. దాంతో వారు చివరకు నన్నే ప్రకటించారు.

ప్ర: భీమిలికి ఏమి చేయాలని మీ ఆలోచన?

గంటా: దేశంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు భీమిలి పరిసరాల్లో సెటిల్ అవుతున్నారు. ఇది అది పెద్ద నియోజకవర్గం. 3.6 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. హ్యాపినింగ్ ప్లేస్. విశాఖపట్నం-భోగాపురం విమానాశ్రయాల మధ్య ఉన్న పట్టణం. ఐటీ, టూరిజం, రియల్ ఎస్టేట్ ఇలా అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. భీమిలి అభివృద్ధికి ఓ విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తాం. అలాగే ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ కూడా తయారుచేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తాం. చిల్లపేటను ట్యాంక్ బండ్‌గా మార్చాలని గతంలోనే చంద్రబాబు చెప్పారు.

ప్ర: జగన్మోహన్‌రెడ్డి తాను గెలిస్తేవిశాఖనుంచే పరిపాలన అంటున్నారు?

గంటా: విశాఖలో పరిపాలనా రాజధాని అనేది ఒక ట్రాష్. మూడు రాజధానుల బిల్లు చెల్లదు. దానిపై న్యాయస్థానంలో కేసులు ఉన్నాయి. అవి తేలకుండా విశాఖను రాజధానిగా మార్చలేరు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అంతా ఇదిగో వస్తున్నారు..అదిగో వస్తున్నారని ప్రచారం చేశారు. ఉగాది, దసరా, దీపావళి, సంక్రాంతి ఇలా అన్ని పండుగలు అయిపోయాయి. జగన్ విశాఖ రావడం అనేది...గోడపై 'రేపు' అని రాసుకోవడం లాంటిదే. ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారు. విశాఖ ప్రశాంత నగరం.పులివెందులఫ్యాక్షన్, కడప రాజకీయాలుచూసి భయపడిపోతున్నారు.

ప్రశ్న: మీరు గెలిస్తేరుషికొండపై సీఎం క్యాంపు కార్యాలయం ఏమి చేస్తారు?

గంటా: రుషికొండపై టూరిజం గెస్ట్‌హౌస్ కూలగొట్టి సీఎం క్యాంప్ ఆఫీసు నిర్మించుకున్నారు. ఆ విషయాన్ని వారు ధైర్యంగా చెప్పుకోలేకపోతున్నారు. ఇప్పటికీ పర్యాటక శాఖ కోసమే నిర్మించామని అబద్ధాలు చెబుతున్నారు. దానిని చూడడానికి ఎవరినీ అనుమతించడం లేదు. ఆ భవనంలో ఖరీదైన వస్తువులు ఉన్నాయని, ఆడంబరంగా కట్టించుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఎలా ఉపయోగించుకుంటే బాగుంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న: భీమిలిలో మిత్రుడైన ముత్తంశెట్టితోనే పోటీ పడుతున్నారు? దీనిపై ఏమంటారు?

గంటా: భీమిలి ప్రజలు బలంగా కోరుకున్నందునే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నా. పోటీ చేసే ప్రతి ఒక్కరూ గెలుస్తామనే విశ్వాసంతోనే ఉంటారు. ఓడిపోతామని ఎవరూ చెప్పరు. నా విజయంపై నాకు ఎలాంటి అనుమానం లేదు. ఎవరైతే బాగుంటుందో భీమిలి ప్రజలే నిర్ణయిస్తారు.

ప్రశ్న: విశాఖ అభివృద్ధిపై?

గంటా: చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు విశాఖకు చాలా ప్రాధాన్యం ఇచ్చారు. వాస్తవానికి హుద్‌హుద్ తరువాత విశాఖ రూపురేఖలే మారిపోయాయి. నగరాన్ని పునర్నిర్మాణం చేశారు. రియల్ బూస్టింగ్ ఇచ్చింది చంద్రబాబే. అది చూసే విశాఖలో అన్నీ ఉన్నాయి..ఇంకేమీ అవసరం లేదు..ఇక్కడే రాజధాని పెడతాం అని జగన్ అంటున్నారు. వైసీపీ బస్టాపులు కూడా సరిగ్గా నిర్మించలేకపోయింది. అదీ వారి ఘనత.

క్రీడా ప్రాంగణాలన్నీ ప్రైవేటుకు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

వ్యక్తికి లీజుకు అప్పగించారు. లీజుకు దక్కించుకున్న వ్యక్తి అక్కడ సాధన చేసేందుకు భారీగా ఫీజులు నిర్ణయించడంతో సాధారణ, మధ్య తరగతికి చెందిన క్రీడాకారులు అటు వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహించలేని పరిస్థితి ఏర్పడింది. జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేసే లక్ష్యంతో నిర్మించిన స్పోర్ట్స్ ఎరీనాను చివరకు జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చడానికన్నట్టు మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అలాగే బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు స్విమ్మింగ్‌పూల్స్ ఉన్నాయి. వీటిని జీవీఎంసీయే నిర్వహిస్తూ వచ్చింది. పెద్దవారికి నెలకు రూ.200, చిన్నారులకు రూ.వంద చొప్పున ఫీజు తీసుకునేవారు. నామమాత్రపు ఫీజు కావడంతో ఎంతోమంది స్విమ్మింగ్‌లో సాధన చేసేవారు. అక్కడ సాధన చేసిన వారిలో ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. కరోనా సమయంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మూతపడింది. తర్వాత దాదాపు రూ.2.5 కోట్లు వెచ్చించి ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆధునీకరించారు. ఇది అందుబాటులోకి వస్తే ఎంతోమంది తిరిగి స్విమ్మింగ్ సాధన చేసేందుకు అవకాశం ఉంటుందని అందరూ ఆశపడ్డారు. చివరకు ఆక్వాస్పోర్ట్స్ ఎరీనా నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని జీవీఎంసీ నిర్ణయించింది. దీనిపై క్రీడాకారులు, క్రీడా సంఘాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు, అభ్యంతరాలు వ్యక్తమవ్వడంతో అధికారులు కొంతకాలం ఆ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టారు. తర్వాత ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో జీవీఎంసీ నిర్ణయించిన ఫీజులు, తర్వాత సమయాల్లో నిర్వాహకులకు నచ్చిన మొత్తంలో ఫీజులు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ప్రైవేటుకు అప్పగించేశారు.

మద్దిలపాలెం సమీపంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పరిస్థితి కూడా అలాగే తయారైంది. దశాబ్దాలుగా స్టేడియంలో వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళ బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్ సాధన చేస్తుంటారు. వీరిలో పిల్లలతోపాటు పెద్దలు కూడా ఉంటారు. పిల్లలకు నిపుణులైన కోచ్‌లు మెలకువలు నేర్పుతూ వారిని ఉత్తమ క్రీడాకారులుగా తయారుచేస్తున్నారు. వీరంతా ఏడాదికి రూ.వెయ్యి చొప్పున జీవీఎంసీకి ఫీజు చెల్లిస్తున్నారు. అయితే నగర నడిబొడ్డున ఉండడం, స్టేడియంలో ఓపెన్‌స్పేస్ కూడా ఉండడంతో కొంతమంది ప్రైవేటు వ్యక్తుల కన్ను పడింది. స్టేడియం నిర్వహణను దక్కించుకుంటే భారీగా సంపాదించవచ్చునని భావించారు. దీంతో స్టేడియాన్ని ఆధునికీకరించి తమకు లీజుకు అప్పగించాలని జీవీఎంసీ అధికారులను కోరినట్టు సమాచారం. ఈ మేరకు వైసీపీ నేతల నుంచి ఒత్తిడి రావడంతో ఆగమేఘాల మీద స్వర్ణభారతి స్టేడియం ఆధునికీకరణ పనులకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తీసుకుని, వెంటనే పనులు మొదలుపెట్టేశారు. స్వర్ణభారతి స్టేడియాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించబోతున్నారనే ప్రచారం జరగడంతో అబ్బే ఇప్పట్లో అలాంటి ఆలోచన లేదంటూ అధికారులు ప్రకటన జారీచేశారు. కానీ ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతుండగానే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో స్టేడియం నిర్వహణపై నిర్ణయం వాయిదా పడిందనే అభిప్రాయం క్రీడా సంఘాల నుంచి వ్యక్తమవుతోంది. నగరంలో క్రీడాకారులను తయారుచేసేందుకు, ప్రతిభ కలిగిన వారికి ప్రోత్సాహం ఇచ్చేందుకు కృషిచేయాల్సిన జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఆదాయమే ధ్యేయం అన్నట్టు వ్యవహరించడంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

తాగునీటికి కటకట

... 5వ పేజీ తరువాయి

కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. అనంతరం టీఎస్ఆర్ రిజర్వాయర్‌లో మిగిలివున్న నీటిని జీవీఎంసీ ట్యాంకర్లకు నింపి, నిర్దేశిత ప్రాంతాలకు తరలించి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఆ తర్వాత కూడా నీరు మిగిలి ఉంటేనే హోటళ్లు, లాడ్జీలతోపాటు ప్రైవేటు బుకింగ్‌లకు సరఫరా చేసే ట్యాంకర్లకు అందజేస్తున్నారు.

ప్రతి కిలోలీటర్‌కు ప్రైవేటు ట్యాంకర్లు రూ.40 చొప్పున జీవీఎంసీకి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. 1,500 కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన 500 ప్రైవేటు ట్యాంకర్లు, వంద కిలోలీటర్లు సామర్థ్యం కలిగిన 1,500 ట్యాంకర్ ఆటోలు నిత్యం టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి నీటిని సరఫరా చేస్తుంటాయి. అయితే గత రెండు రోజులుగా టీఎస్ఆర్ రిజర్వాయర్‌లోని పంపుల వద్ద నీటి లభ్యత తగ్గిపోవడంతో ప్రైవేటు ట్యాంకర్లకు నీటిని ఇవ్వడం లేదు. దీంతో ఇక్కట్లు మొదలయ్యాయి. జీవీఎంసీ ట్యాంకర్లకు నింపిన తర్వాతే ప్రైవేటు ట్యాంకర్లకు అందిస్తుండడంతో అన్ని ట్యాంకర్లకు అందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద ప్రైవేటు ట్యాంకర్లు బారులు తీరిపోతున్నాయి. మంగళ, బుధవారాల్లో టీఎస్ఆర్ కాంప్లెక్స్ నుంచి వీఎంఆర్‌డీఏ సెంట్రల్ పార్క్ సమీపంలోని తెన్నేటి విశ్వనాథం సర్కిల్ వరకూ రోడ్డుపై బారులు తీరి నిలిచిపోయాయి.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

పోరాటంతోనే హక్కులు సాధ్యం

- మే డే వేడుకల్లో సీపీఎం నాయకులు
- తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో ఘనంగా కార్మిక దినోత్సవం

భీమునిపట్నం, మే 1 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ కార్మికుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కార్మికులు ఊరేగింపులు, ఆర్భాటాలు లేకుండా వేడుకలు జరిపారు. భీమిలిలోని చిన్నబజారు జంక్షన్‌లో ముఠా కార్మికులు సీపీఎం జెండా ఆవిష్కరించారు.ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, భీమిలి జోనల్ కార్యాలయం వద్ద, నేరేళ్లవలసలో సీపీఎం నేత రమణ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్. అప్పలనాయుడు, శ్రీనివాసవర్మ, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలసలోని సీపీఐ కార్యాలయం వద్ద ఉన్న గుజ్జురామునాయుడు భవన్‌లో మే డే వేడుకలు ఘనంగా జరిగాయి.సీపీఐ. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సీనియర్ నాయకుడు చిల్ల నర్సింహులు సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అల్లు బాబూరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అలాగే చిట్టివలసలో జరిగిన వేడుకల్లో లేబర్ యూనియన్ నాయకుడు కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, చిల్ల అప్పలసూరి, అప్పలరాము, సీహెచ్ రామిరెడ్డి, మావూరి వీర్రాజు, కె. అప్పలనర్సయ్య పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : ఏయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో మే డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య సీతా మాణిక్యం మాట్లాడుతూ పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యమన్న విషయాన్ని కార్మికులు గుర్తించి, ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయలక్ష్మి, డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, డాక్టర్ పల్లవి, డాక్టర్ ఎస్‌బీ చంద్రకళ, డాక్టర్ రాఘవయ్య, భగవత్ పాణిగ్రాణి, డాక్టర్ నాగభూషణం పాల్గొన్నారు. 16వ వార్డు ఎంఎంటీసీ కాలనీలోని సూర్యానగర్‌లో సీపీఐ నాయకుడు పడాల గోవింద్ ఆధ్వర్యంలోనూ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆ వార్డు సీపీఐ సహాయ కార్యదర్శి ఎన్. మధురెడ్డి, రావి అశోక్, నూకరాజు, కన్నారావు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఆరిలోవ : కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా ఆయన జూపార్కు వద్ద ఏర్పాటు కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతుల మీద ముప్పేట దాడి చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం, కార్మిక చట్టాలను లేబర్ కోడ్స్‌గా మార్చడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల కార్మికులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని చెప్పారు. జూపార్కులో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూపార్కు యూనియన్ నాయకులు నరేష్, నరసింగరావు, పైడిరాజు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : మే డే స్ఫూర్తితో కార్మికులు హక్కులను కాపాడుకోవాలని ప్రజా శక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎంవీఎస్ శర్మ పిలుపునిచ్చారు. మద్దిలపాలెం సీపీఎం కార్యాలయం వద్ద నిర్వహించన కార్మిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీతల అప్పారావు, సూరిబాబు, లక్ష్మీ, కృష్ణారావు, వెంకటరావు పాల్గొన్నారు.

కొమ్మాది : కొమ్మాది జంక్షన్ సాయిరాం కాలనీలో దుర్గాభవానీ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ మూర్తి, యోగేశ్వరావు, కురుమోజు గోవిందరావు, ఎస్. వైకుంఠరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రత్నం :** జగదాంబ, శరత్, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** శ్రీకన్య, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం) మౌర్య (గోపాలపట్నం), హెవెన్-3 (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** మెలోడి, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **మంజుమ్మెల్ బోయ్స్ :** సంగం, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 22, టమాటా 23, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 28, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజ్ 22, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళా దుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 144, బరబటి 30, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 28, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 80, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 52, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	-- 120
ఫారం ధర	-- 140
విత్ స్కిన్	-- 250
స్కిన్‌లెస్	-- 260

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..

జగన్ పాలన పట్ల ప్రజల్లో అసంతృప్తి

భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మే 1 : ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చని జగన్‌కు ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. సాలిగ్రామపురం సత్యసాయినగర్ వద్ద బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో పేచీలు, మెలికలు పెట్టి పేదల ఊసురుపోసుకున్న జగన్‌కు ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. మద్య నిషేధం చేయకపోతే ఎన్నికల్లో ఓటు అడగబోనని ప్రగల్భాలు పలికిన జగన్ ఆ హామీని అమలు చేయకుండా మరోసారి ప్రజలను మోసం చేయడానికి జనం మధ్యలోకి వచ్చారని పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానం భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. అనంతరం 45వ వార్డులోని బిలాల్ కాలనీ, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాలనాయుడు, రాజు, త్రినాథ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


సాలిగ్రామపురంలో గంటాకు గజమాలతో స్వాగతం


గొల్లల ఎండాడ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

గంటాకు మద్దతుగా ప్రచారం

మధురవాడ/విశాలాక్షినగర్ : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నాయకులు పేర్కొన్నారు. బుధవారం వారు ఏడో వార్డులోని మిథిలాపురి వుడా కాలనీ, మొగధారమ్మ గుడి ప్రాంతాల్లో గంటాకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంటాను, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 8 వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టిపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు గొల్లల ఎండాడలో ప్రచారం చేశారు.ఈకార్యక్రమంలో జాస్తీ ఆశ, సారిపిల్లి శ్రీను, దొరబాబు, శాఖరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, మే 1 : సింహగిరిపై ఈనెల 10న జరిగే వరాహలక్ష్మీనృసింహస్వామి నిజ రూపదర్శనం చందనోత్సవం విజయవంతానికి ముందస్తు ప్రణాళికలతో కృషి చేస్తున్నట్టు చందనోత్సవ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కోడూరి రామచంద్ర మోహన్ తెలిపారు. బుధవారం ఆయన ఈఓ సింగాల శ్రీనివాసమూర్తితో కలిసి ఉత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూ ఏర్పాట్లు పరిశీలించి కొన్ని మార్పులు సూచించారు. అలాగే పార్కింగ్ స్థలాల ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈలు నాగేశ్వరరావు, డీవీఎస్ రామరాజు (హరి), స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

వైసీపీని ఎవరూ నమ్మడం లేదు

విశాఖ ఎంపీ కూటమి అభ్యర్థి శ్రీభరత్

ఎంవీపీ కాలనీ, మే 1 : వైసీపీని సొంత పార్టీ కార్యకర్తలు, నేతలే నమ్మడం లేదని, అందుకే వలంటీర్లను అడ్డదారుల్లో ఉపయోగించుకోవాలని చూస్తోందని విశాఖ పార్లమెంటు కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ విమర్శించారు. బుధవారం రాత్రి ఆయన ఎంవీపీ కాలనీలోని టీడీపీ ఎన్నికల కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ జనసేన నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తను కులం కంటే గుణానికే ఎక్కువగా ఇష్టపడతానన్నారు. వైసీపీ మాత్రం కులం పేరుతో లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన సమన్వయంతో పనిచేయాలని కోరారు. పొత్తులో భాగంగా భీమిలి టీడీపీకి వెళ్లిందని,అయినా జనసేన ఇన్‌చార్జి సందీప్ కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నారని అభినందిం చారు. ఈ సమావేశంలో విశాఖ పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, భీమిలి జనసేన ఇన్‌చార్జి సందీప్, మండల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో శ్రవణం నక్షత్ర హవనం

సింహాచలం, మే 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీ నంలో కొండదిగువ స్వామివారి ఉద్యానవనంలో కొలువుదీరిన పద్మావతి, అలిమేల్‌మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రవణం నక్షత్ర హవనం బుధవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞపెరుమాళ్ళు సుదర్శనుడ్ని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం లోకకల్యాణార్థం అనే సంకల్పంతో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేసి హవనాన్ని నిర్వహించి పూర్ణాహుతి జరిపారు.


ముత్తంశెట్టి శ్రీనివాసరావును సన్మానిస్తున్న స్థానికులు


కొమ్మాది నుంచి జరిగిన రోడ్ షోలో పాల్గొన్న శ్రీనివాసరావు, తదితరులు

వైసీపీకి ఓటు వేసి అభివృద్ధికి సహకరించండి : ముత్తంశెట్టి

భీమునిపట్నం, మే 1 : రాష్ట్ర భవిష్యత్‌కు ఓటే ఆయుధమని అందరూ గ్రహించాలని భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి ఆయన తన క్యాంప్ కార్యాలయంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం, రాష్ట్రం బాగుపడాలంటే ఓటే ఆయుధమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రజా చైతన్యానికి పీఆర్ఎస్ఐ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ జాతీయ సెక్రటరీ జనరల్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి, విశాఖ ఛాప్టర్ అధ్యక్షుడు ఎంకేవీఎల్ నరసింహం, జాతీయ ఉపాధ్యక్షుడు (సౌత్)యూఎస్ శర్మ, విశాఖ ఛాప్టర్ సభ్యులు బి.విజయప్రసాద్, పీఆర్ మార్టిన్, ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ నందాబాబు, అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, నందేశ్‌బాబు, భీమిలి ఏఎంసీ ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దాట్ల ప్రసాదరాజు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, భీమిలి వైసీపీ అధ్యక్షుడు గాడు శ్రీను, తగరపువలస పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, నాయకులు సరగడ రఘునాథరెడ్డి, చెల్లూరి పైడప్పడు పాల్గొన్నారు.

కొమ్మాదిలో రోడ్ షోకు ఆదరణ

కొమ్మాది : భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కొమ్మాదిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన రోడ్ షోకు విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొమ్మాది జంక్షన్ నుంచి ప్రారంభ మైన రోడ్ షో రిక్షాకాలనీ, కొమ్మాది, అమరావతి కాలనీ, కె1కాలనీ, రేవళ్లపాలెం వరకు కొనసాగింది.


ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి


ఆరిలోవ : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వెలగపూడి, శ్రీభరత్ సోదరుడు సిద్ధార్థ


కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న వెలగపూడి సతీమణి సుజన


పార్టీలో చేరిన వారితో వెలగపూడి రామకృష్ణబాబు, తదితరులు

మత్స్యకారులకు అండగా ఉంటా : వెలగపూడి

ఆరిలోవ, మే 1 : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని తూర్పు నియోజకవర్గం కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బుధవారం ఆయన కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సోదరుడు సిద్ధార్థతో కలిసి 11, 12 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా ఉంటానని, పేదల కష్టాలు తీర్చేందుకే సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని చెప్పారు. శ్రీభరత్ సోదరుడు సిద్ధార్థ మాట్లాడుతూ నగరం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే శ్రీభరత్‌ను, వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, రాగతి అచ్చుతరావు, ముగడ రాజారావు,గాడి సత్యం, పోలారావు, ఏడువాక సన్యాసిరావు, పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : తూర్పు ఎమ్మెల్యేగా నాలుగోసారి వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని ఆయన తనయుడు ప్రతాప్ రుద్ర కోరారు. బుధవారం ఆయన 16వ వార్డులో ప్రచారం నిర్వహించారు. వెలగపూడి సతీమణి సుజన కిర్లంపూడి లేఅవుట్ ప్రాంతంలో ప్రచారం చేశారు.

ఆరిలోవ/పెదవాల్తేరు : జీవీఎంసీ 13వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే వెలగపూడి, టీడీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 21వ వార్డుకు చెందిన పలువురు యువకులు వెలగపూడి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పొన్నాడ విష్ణు వర్ధన్, కుడుపురెడ్డి శంకర్రావు, వై. శ్రీను, బంగారురాజు, హరి ఉన్నారు.

15వ వార్డులో టీడీపీ ఎన్నికల కార్యాలయం

వెంకోజీపాలెం, మే 1 : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఎన్నికల కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, తదితరులు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ గోవింద్, కె. మహేష్, సత్యనారాయణ, బోను శ్రీను. బీజేపీ నాయకుడు కనకాల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే మహిళా సాధికారత

పద్మనాభం (రూరల్), మే 1 :కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే మహిళా సాధికారత సాధ్యమని రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి అన్నారు. బుధవారం ఆమె అయినాడ, యాతపెట, సత్యనారాయణపురం గ్రామాల్లో భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

నిరంతర శ్రమతోనే విజయం

పెదవాల్తేరు, మే 1 : లక్ష్య సాధన అన్నది నిరంతర శ్రమతోనే సాధ్యపడుతుందని ప్రముఖ విద్యా వేత్త ఆచార్య కోలవెన్నుమలయవాసిని అన్నారు. బుధవారం ఆమె బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో బాలల విజ్ఞాన వికాస్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల వికాసానికి ఇటువంటి శిక్షణ ఎంతో అవసరమన్నారు. 36 ఏళ్లు వేసవిలో శిబిరం నిర్వహిస్తున్న ఆచార్య సోమరాజు బృందాన్ని అభినందించారు.


పార్టీలో చేరిన వారితో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ


చిన్నారితో నినాదం చేయిస్తున్న ఎంవీవీ

విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి : ఎంవీవీ

పెదవాల్తేరు, మే 1 : విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందని తూర్పు వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం రాత్రి ఆయన 19వ వార్డు పెదజాలారిపేటలో వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకట లక్ష్మీదాస్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాల వారికి అండగా నిలిచారన్నారు.ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణ, తదితరులు పాల్గొన్నారు. కాగా 27వ వార్డుకు చెందిన పలువురు నాయ కులు బోణీ శివరామకృష్ణ సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి పార్టీ కార్యాలయంలో ఎంవీవీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు.అలాగే పెదజాలారిపేటలో మేము సిద్ధం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ఆరు నెలల్లో వార్డులో ఎన్నో సమస్యలను పరిష్కరించానని, ఒక్క అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. వెలగపూడి తనపై తప్పుడు ఫిర్యాదులు చేయడం దారుణమన్నారు. పెదజాలారిపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర వైసీపీ అధ్యక్షుడు కోలా గురువులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జానకీ రామ్, వార్డు ఇన్‌చార్జి సూరడా వెంకట లక్ష్మి దాస్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆరిలోవ : రాష్ట్రానికి గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను జగన్ చేశారని ఎంవీవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం ఆయన 11వ వార్డులోని పలు ప్రాంతాల్లో గొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝూన్సీని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు వైసీపీ అధ్యక్షుడు ముగడ రమేష్, పాల్గొన్నారు.

పీవీజీ రాజు సేవలు ఆదర్శనీయం

భీమునిపట్నం, మే 1 : మహారాజా పీవీజీ రాజు సేవలు ఆదర్శనీయమని ఆదర్శ హిందీ ప్రేమి మండలి గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. బుధవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో పీవీజీ రాజు శత జయంతి వేడుకలు నిర్వహించిరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని భావించి పీవీజీ రాజు మాన్సాస్ ట్రస్టును స్థాపించి ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. కాగా తొలుత రాజు చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జీఎల్ఎన్ రాజు, నాయకులు చురకల రమణ, పోలిరాజు, నాగరాజు, కొక్కిరి అప్పన్న, నొల్లి అప్పన్న, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : విద్యాలయాలు, దేవాలయాల అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి వేల ఎకరాలు ధారాదత్తం చేసిన పూసపాటి విజయరామ గజపతి రాజు శతజయంతి వేడుకలు ఆర్కే బీచ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీకి చెందిన క్షత్రియ సంఘం సభ్యులు, విశాఖ క్షత్రియ సంక్షేమ సమితి సభ్యులు బీచ్ రోడ్డులోని గజపతి రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఈవీఎంలపై ఎన్నికల సిబ్బందికి అవగాహన

ఎంవీపీ కాలనీ, మే 1 : తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై ఏయూలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఈవీఎంలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని చెప్పారు.

ఘనంగా అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం

సాగర్‌నగర్, మే 1 : గుడ్లవానిపాలెంలో ముత్యాలమ్మ, భూలోకమ్మ, పోలమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన తరువాత భక్తులను దర్శనాలకు అనుమతించారు.

మన్యానికి మకుటం

- బ్రిటీష్ కాలంలోనే ప్రాచుర్యం
- అల్లూరి ఉద్యమానికి కేంద్రం
- 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు
- 2004 వరకూ కొనసాగిన సెగ్మెంట్
- పునర్విభజనలో భాగంగా 2008లో 'పాడేరు'లో విలీనం

చరిత్ర పుటల్లోకి చింతపల్లి


చింతపల్లి ముఖ ద్వారం


దేవూరి కొండలరావు

1962-2004 మధ్యకాలంలో పదిసార్లు ఎన్నికలు

- కాంగ్రెస్ పార్టీ ఐదు పర్యాయాలు, టీడీపీ మూడుసార్లు, సీపీఐ రెండుసార్లు విజయం
- మరోమారు నియోజకవర్గంగా ఏర్పడుతుందని స్థానికుల ఆశాభావం

ఏజెన్సీలో చింతపల్లి ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉంది. బ్రిటీష్ వారి హయాంలో విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు చింతపల్లి కేంద్రంగానే తన ఉద్యమాన్ని నిర్మించారు. తొలి సాయుధ పోరాటంలో భాగంగా చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిచేశారు. తుపాకులను ఎత్తుకెళ్లడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలమైంది. కాగా స్వాతంత్ర్యానంతరం 1953లో ఆంధ్ర రాష్ట్రం, 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన విషయం తెలిసింది. అప్పటికి చింతపల్లి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం లేదు. 1961లో చేపట్టిన డీలిమిటేషన్ అనంతరం చింతపల్లి కేంద్రంగా 1962లో శాసనసభా నియోజకవర్గం ఏర్పాటైంది. దాదాపు 55 ఏళ్ల తరువాత 2007-08లో జరిగిన నియోజకవర్గాల పునర్విభ జనలో చింతపల్లిని రద్దు చేశారు. 2004లో జరిగిన ఎన్నికలే చివరివి. 2009 ఎన్నికల నుంచి చింతపల్లి ప్రాంతం పాడేరు నియోజకవర్గంలో కొనసాగు తున్నది. కాగా చింతపల్లి నియోజకవర్గంగా ఉండగా 1962 నుంచి 2004 వరకు మొత్తం పదిసార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా ఐదు పర్యాయాలు గెలుపొం దింది. టీడీపీ మూడుసార్లు, సీపీఐ రెండుసార్లు విజయం సాధిం చాయి. టీడీపీ ఆవిర్భా వం తరువాత ఈ స్థానానికి ఆరుసార్లు ఎన్నికలు జరగ్గా...కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి మాత్రమే గెలుపొందడం గమనార్హం. 1994లో పొత్తులో భాగంగా టీడీపీ ఈ సీటును సీపీఐకి విడిచిపెట్టింది. లేకపోతే ఆ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసి వుంటే కచ్చితంగా విజయం సాధించి వుండేదని ఆ పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

1962 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో చింతపల్లి నుంచి గెలుపొందిన అభ్యర్థులు, ఓడిన సమీప ప్రత్యర్థులు, ఇతర వివరాలు...

- తొలిసారి 1962లో జరిగిన ఎన్నికల్లో 11,807 ఓట్లు పోలయ్యాయి. లంబసింగి గ్రామానికి చెందిన దేవూరు కొండలరావు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి, స్వతంత్ర పార్టీ అభ్యర్థి కిల్లు మల్లంనాయుడుపై 834 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1967లో జరిగిన ఎన్నికల్లో 32,141 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి దేవూరు కొండలరావు...స్వతంత్ర పార్టీ అభ్యర్థి వీటీ పడాల్‌పై 4,850 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1972 ఎన్నికల్లో 30,132 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి ఇంగువ రామన్నపడాల్, ఇండిపెండెంట్ అభ్యర్థి మత్స్యరాస మత్స్యరాజుపై 11,772 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1978లో జరిగిన ఎన్నికల్లో 47,997 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ అభ్యర్థి దేవూరు కొండలరావు, శరభన్నపాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్(ఐ) అభ్యర్థి లోకుల కన్నాలుపై 3,656 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

తెలుగుదేశం ఆవిర్భావంతో కాంగ్రెస్ హవాకు బ్రేకులు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో చింతపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హవాకు బ్రేకులు పడ్డాయి. నియోజకవర్గం ఏర్పాటైన తరువాత వరుసగా నాలుగు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించగా, 1983లో జరిగిన ఎన్నికల్లో 47,566 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ తరఫున చౌడుపల్లి పంచాయతీకి చెందిన కోరాబు వెంకటరత్నం పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి దేపూరు కొండలరావుపై 1,884 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

- 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో 52,489 ఓట్లు పోలయ్యాయి. కొయ్యూరుకు చెందిన మొట్టడం వీర వెంకట సత్యనారాయణ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కంకిపాటి వీర భద్రరావుపై 14,438 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.
- 1989లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం, వామపక్షాలు, బీజేపీ, జనతాదళ్ తదితర పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. పొత్తులో భాగంగా చింతపల్లి స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి బాలరాజు, సీపీఐ అభ్యర్థి కొర్రు మల్లయ్యపై 1,999 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.
- 1994లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం, వామపక్షాలు కూటమిగా ఏర్పడి పోటీ చేశాయి. ఈసారి కూడా చింతపల్లి స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. ఈ ఎన్నికల్లో సీపీఐ తొలిసారి గెలుపొందింది. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన గొడ్డేటి దేముడు సీపీఐ అభ్యర్థిగా పోటీ చేశారు. మొత్తం 1,05,024 ఓట్లు పోలవ్వగా దేముడుకు 35,257 ఓట్లు, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే మొట్టడం వీర వెంకట సత్యనారాయణకు 30,175 ఓట్లు, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజుకు 23,497 ఓట్లు వచ్చాయి. 5,082 ఓట్ల మెజారిటీతో దేముడు గెలిచారు.
- 1999 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ జతకట్టగా, వామపక్షాలు విడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో 1,05,024 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి మొట్టడం వీర వెంకట సత్యనారాయణకు 41,163 ఓట్లు, సీపీఐ అభ్యర్థి గొడ్డేటి దేముడుకు 32,892 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బాలరాజుకు కాకుండా కంకిపాటి పద్మకుమారికి టికెట్ ఇచ్చింది. దీంతో బాలరాజు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 14,122 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ నాలుగో స్థానానికి పడిపోయింది.
- 2004లో జరిగిన ఎన్నికల్లో 1,08,530 ఓట్లు పోలయ్యాయి. ఈసారి కాంగ్రెస్, వామపక్షాలు ఒక కూటమి (యూపీఏ)గా, టీడీపీ, బీజేపీ మరో కూటమిగా (ఎన్‌డీఏ) పోటీ చేశాయి. పొత్తులో భాగంగా ఈ స్థానం నుంచి సీపీఐ అభ్యర్థి గొడ్డేటి దేముడు పోటీ చేశారు. దీంతో పుసుపులేటి బాలరాజు అసంతృప్తి చెంది, ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. దేముడు 52,705 ఓట్లు సాధించి ఎమ్మెల్యేగా గెలిచారు. బాలరాజు 35,223 ఓట్లతో రెండో స్థానంలో, టీడీపీ అభ్యర్థి చిల్లంగి జ్ఞానేశ్వరి 14,471 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2008లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో చింతపల్లి నియోజకవర్గాన్ని రద్దు చేసి, ఏజెన్సీలోని మూడు మండలాలను పాడేరు నియోజకవర్గంలో విలీనం చేశారు. దీంతో ఐదున్నర దశాబ్దాల చరిత్ర వున్న చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కనుమరుగైంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే చింతపల్లి నియోజకవర్గం మళ్లీ ఏర్పాటు అవుతుందని ఈ ప్రాంతానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● చింతపల్లి


ఇంగువ రామన్నపడాల్


కోరాబు వెంకట రత్నం


ఎంవీవీ సత్యనారాయణ


గొడ్డేటి దేముడు


పసుపులేటి బాలరాజు


చింతపల్లి మెయిన్ రోడ్

ఉత్తరంలో ఉత్కంఠ

- కూటమి అభ్యర్థిగా విష్ణుకుమార్‌రాజు
- వైసీపీ అభ్యర్థిగా కేకే రాజు
- జై భారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ
- నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు
- ఒకసారి కాంగ్రెస్, మరొకసారి బీజేపీ/టీడీపీ, ఇంకొకసారి టీడీపీ అభ్యర్థుల గెలుపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విద్యావంతులు, సంపన్న వర్గాలకు చెందినవారే అధికం. దీంతో అక్కడ ఓటర్లు ప్రలోభాలకు లొంగిపోకుండా విచక్షణతో ఓటేస్తారనే అభిప్రాయం రాజకీయ పార్టీల్లో ఉంది. 2009లో నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ మూడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఒకసారి కాంగ్రెస్, మరొకసారి టీడీపీ, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి, ఇంకొకసారి టీడీపీ అభ్యర్థి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయి. కూటమి అభ్యర్థిగా పి.విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థిగా కమ్మిల కన్నపరాజు (కేకే రాజు) పోటీలో ఉన్నారు. జై భారత్ పార్టీ తరఫున సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ బరిలో నిలిచారు.


విష్ణుకుమార్‌రాజు


కేకే రాజు


వీవీ లక్ష్మీనారాయణ

2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తైనాల విజయ్‌కుమార్ 5,523 ఓట్ల మెజారిటీతో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన షిరీన్ రెహమాన్‌పై విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పెనుమత్స విష్ణుకుమార్‌రాజు పోటీ చేయగా, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నుంచి చొక్కాకుల వెంకటరావు పోటీచేశారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,22,478 ఓటర్లు ఉండగా వీరిలో 1,37,736 మంది (61.9 శాతం) తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో విష్ణుకుమార్‌రాజుకు 82,079 (51.34 శాతం) పడగా, వైసీపీ అభ్యర్థి చొక్కాకుల వెంకటరావుకు 63,839 (39.93 శాతం) వచ్చాయి. దీంతో విష్ణుకుమార్‌రాజు 18,240 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు వేర్వేరుగా పోటీ చేసినప్పటికీ టీడీపీ నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు విజయం సాధించారు. మొత్తం 1,77,113 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 67,352 మంది టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు, 65,408 మంది వైసీపీ అభ్యర్థి కమ్మిల కన్నప్పరాజు (కేకే రాజు)కు ఓటు వేశారు. జనసేన నుంచి పోటీ చేసిన పసుపులేటి ఉషాకిరణ్‌కు 19,139 ఓట్లు, బీజేపీ నుంచి పోటీ చేసిన విష్ణుకుమార్‌రాజుకు 18,790 ఓట్లు లభించాయి. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన విష్ణుకుమార్‌రాజును పోటీ చేస్తున్నారు. వైసీపీ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన కేకే రాజు తిరిగి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా విశాఖ పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన వీవీ లక్ష్మీనారాయణ ఈసారి ఉత్తరం నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, మురళీనగర్, మాధవధార, 104 ఏరియా, అక్కయ్యపాలెం, కంచరపాలెం (కొంత భాగం) ఉన్నాయి.

ఓటరు మాట

పరిశ్రమల పరిరక్షణతో మేలు



స్టీల్‌ప్లాంట్ లాంటి భారీ ప్రభుత్వ రంగసంస్థలను కాపాడే ప్రభుత్వాలు కావాలి. ప్రైవేటుకు అప్పగిస్తే దేశ, రాష్ట్ర ఆర్థిక రంగం పూర్తిగా దెబ్బతిని, భవిష్యత్తు భారతం అప్పులపాలవుతుంది. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, కొత్తగా ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలను ఎన్నుకుందాం. ఓటర్లు ఆలోచించి సమాజానికి మేలుచేసే నాయకులకు మద్దతు ఇవ్వాలి. **- పి.లక్ష్మి, అల్లిపురం, విశాఖపట్నం**

ఉక్కును కాపాడేవారికే ఓటు



విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా అడ్డుకుంటామని భరోసా ఇచ్చే నేతలు, పార్టీకే నగరవాసులు ఓటు వేయాలి. కార్మికులు మూడు సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నా స్పష్టమైన హామీ లభించలేదు. ఎన్నికల సమయం వచ్చింది. ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడిన నాయకులను చట్ట సభలకు పంపాలి. ఇప్పటివరకు మాటలతో మోసం చేసిన నాయకులను తరిమికొట్టాలి.

- డి.తాతారావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి, గాజువాక

సమర్థ నాయకుడ్ని ఎన్నుకోండి



రాజధాని, పోలవరం సత్వరమే పూర్తి చేయగల సమర్థ నేత ఉన్న పార్టీకి ఓటువేసి అధికారంలోకి తెచ్చుకోవాలి. భావ, వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించే నేతల అవసరముంది. రాజ్యాంగ వ్యవస్థలను లెక్కచేయకుండా నియంతలా వ్యవహరిస్తూ, భూకబ్జాలకు పాల్పడుతున్నవారికి ఓటుతో బుద్ధి చెప్పాలి. యువతకు ఉపాధి, రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా నడిపించే సత్తా ఉన్న నాయకుడు అవసరం. తాయిలాలు, ఉచితాలకు, ప్రలోభాలకు లొంగి అనర్హులకు ఓటు వేస్తే భవిష్యత్తు తరాలకు అన్యాయం జరుగుతుంది. **- ఎస్ఎస్ శాస్త్రి, విశాఖపట్నం**

ప్రభుత్వ ఆదాయం పెంచేవారికే ఓటు



పూర్తిగా అప్పుల్లో మునిగిపోయిన రాష్ట్రాన్ని ఆదుకునే నాయకుడ్ని ఎన్నుకోవాలి. ఉచితాల పేరుతో ఇప్పటికే నాశనమైపోయిన వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఆదాయం పెంచే నేత అవసరం. అతనికే ఓటు వేయాలి. నిత్యావసర సరకుల ధరలు తగ్గించి సామాన్యుడ్ని ఆదుకునే ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలి. ఉచిత విద్య, వైద్యం, అందరికీ అందుబాటులో ఉండాలి. యువతకు ఉపాధి గురించి ఆలోచించాలి. ఇలాంటి ఆలోచనలతో ఉన్న అభ్యర్థులను చట్టసభలకు పంపితే మేలు జరుగుతుంది. ఆలోచించి ఓటు వేయాలి. **- జీఎస్‌డీవీ రామారావు, అనకాపల్లి**


మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

నాడు కుగ్రామం... నేడు మహా నగరం

- ఊహించని స్థాయిలో విస్తరించిన విశాఖ
- కేవలం ఒక్క నియోజకవర్గం నుంచి ఐదింటికి పెరిగిన వైనం
- 68 వేల నుంచి 17 లక్షలకు పెరిగిన నగర ఓటర్లు



(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

విశాఖపట్నం ఒకప్పుడు అతిచిన్న మత్స్యకార పల్లె. కుగ్రామంగా ప్రస్థానం ప్రారంభమయింది. డెబ్బై ఎనభై ఏళ్లలో ఎవరూ ఊహించని స్థాయిలో విస్తరించింది. తొలి సాధారణ ఎన్నికల్లో విశాఖపట్నం ఒక్కటే అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. దేశంలో తొలిసారిగా 1952 ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విశాఖపట్నం అసెంబ్లీ ఓటర్ల సంఖ్య కేవలం 68,282 మంది మాత్రమే. కానీ నగరం విస్తరించి ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, శివారు ప్రాంతాలతో కలిసి మరో రెండు నియోజకవర్గాలు ఏర్పడ్డాయి.

విశాఖ నగర ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 17 లక్షలకు చేరింది. జిల్లా ఓటర్ల సంఖ్య 20 లక్షల మార్కు దాటింది. ఇందులో ఆనందపురం, పద్మనాభం, భీమిలి గ్రామీణం, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో సుమారు మూడు లక్షల ఓటర్లున్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జరిగిన 1952 మొదటి ఎన్నికలలో విశాఖ ఒకటే అసెంబ్లీ నియోజకవర్గం. ఆ ఎన్నికల్లో ఓటర్లసంఖ్య కేవలం 68,282. తొలి ఎన్నికల్లో తెన్నేటి విశ్వనాథం ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. తరువాత విశాఖ విస్తరించే క్రమంలో 1955 మధ్యంతర ఎన్నికలలో విశాఖతోపాటు కణితి (నగరంలో కణిత బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించిన ప్రాంతం) కేంద్రంగా రెండో అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటుచేశారు. దీంతో విశాఖ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటర్ల సంఖ్య 58,132 మందికి తగ్గారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నియోజకవర్గాలు ఏర్పాటుచేసిన క్రమంలో విశాఖ క్రమసంఖ్య 23. తొలి సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల నంబరులో విశాఖ 19. 1962లో జరిగిన మూడో సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ అసెంబ్లీ ఓటర్ల సంఖ్య 71,794కు పెరిగింది. ఆ తరువాత జనాభా మేరకు ఓటర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1967 ఎన్నికల సమయానికి కణితి అసెంబ్లీని రద్దుచేసి విశాఖ-1, విశాఖ -2 సెగ్మెంట్లు ఏర్పాటయ్యాయి. 2004 వరకు కొనసాగాయి. అప్పుడు విశాఖ-1లో 1,27,044, విశాఖ-2లో ఓటర్లసంఖ్య 4,03,262కు పెరిగింది. నియోజకవర్గాల పునర్విభజన తరువాత విశాఖ తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక నియోజకవర్గాలు నగర పరిధిలో, భీమిలి, పెందుర్తిలో అత్యధిక ప్రాంతాలు వచ్చి చేరాయి.

కలిసొచ్చిన అదృష్టం

భీమిలిలో నాలుగుసార్లు జయకేతనం

- ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు రాజకీయ ప్రస్థానం


ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు

జిల్లాలో భీమునిపట్నం ప్రత్యేకత కలిగిన అసెంబ్లీ నియోజకవర్గం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి వరుసగా నాలుగుసార్లు అదే పార్టీకి చెందిన అభ్యర్థి ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు విజయం సాధించడం ఇక్కడ ప్రత్యేకం. ఎలాంటి రాజకీయ పరిచయం లేని వ్యక్తి వరుస విజయాలను అందుకోవడం అప్పట్లో సంచలనం.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంలో భీమిలి నుంచి పూసపాటి ఆనందగజపతిరాజు పోటీచేసి విజయం సాధించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో విద్యాశాఖా మంత్రిగా పనిచేశారు. 1985లో నాదెండ్ల భాస్కరరావు ఉదంతం అనంతరం ఎన్టీఆర్ అసెంబ్లీని రద్దుచేసి కొత్తవారికి టికెట్లు ఇచ్చారు. ఆ సమయంలో పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామానికి చెందిన అప్పల అప్పలనరసింహరాజుకు టికెట్ లభించింది. ఏమాత్రం రాజకీయ అనుభవం లేని వ్యక్తికి ఎన్టీఆర్ టికెట్ ఇవ్వడమే గొప్ప విషయమైతే.. ఆ ఎన్నికల్లో ఆయన మంచి మెజారిటీతో విజయం సాధించడం మరో విశేషం.

కలిసొచ్చిన అంశాలివి...

తొలిసారి భీమిలి నుంచి ఆర్ఎస్‌డీపీ రంగంలోకి దిగే సమయంలో కాంగ్రెస్ తరఫున పోటీకి డిమాండ్ ఉండేది. ఆ పార్టీ ప్రొఫెసర్ ఆకెళ్ల శేషగిరిరావుకు టికెట్ ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలోని సీనియర్ నేతలు ఎవరూ అతనికి సహకరించలేదు. దీంతో అప్పలనరసింహరాజు విజయం నల్లేరు మీద నడకలా సాగిపోయింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీకి అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. కాగా విజయనగరం జిల్లా అలమండకు చెందిన కాకర్లపూడి సూర్యనారాయణరాజుకు కాంగ్రెస్ బి ఫారం ఇచ్చింది. ఈలోగా పీసీసీ అధ్యక్షుడి మార్పు జరగడంతో విశాఖపట్నానికి చెందిన సుంకర ఆళ్వారుదాసుకు కూడా బి ఫారం లభించింది. ఇద్దరూ కాంగ్రెస్ అభ్యర్థులుగానే నామినేషన్లు వేశారు. దీంతో ఈసీ ఇద్దరినీ స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటించడంతో బ్యాలెట్‌లో హస్తం గుర్తుకు చోటు దక్కలేదు. దీంతో అప్పలనరసింహరాజు సునాయాసంగా విజయం సాధించారు.

మూడో సారీ... అదే రీతి

మూడోసారి పోటీలో టీడీపీ మండలాధ్యక్షుడు కోరాడ శంకరరావు కాంగ్రెస్‌లో టికెట్ సాధించారు. దీంతో కాంగ్రెస్ ఆశావహులు సహకరించలేదు. పైగా అప్పలనరసింహరాజు విజయానికి కృషి చేశారు. ఇక నాల్గోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతమయింది. పాత ప్రత్యర్థులే మళ్లీ తలపడ్డారు. శంకరరావుపై వ్యతిరేకత అప్పలనరసింహరాజుకు విజయం సాధించిపెట్టింది. అయితే 2009లో సింహాచలం సర్పంచి కర్రి సీతారామ్ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగడం, బలమైన అతని సామాజికవర్గం సహకరించడంతో అప్పలనరసింహరాజుకు ఓటమి తప్పలేదు. అనంతరం అతనికి మళ్లీ పోటీచేసే అవకాశం దక్కలేదు. దీంతో తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ అభ్యర్థుల విజయానికి సహకరిస్తున్నారు.

● భీమునిపట్నం రూరల్

